PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 83 | విజయవాడ, సోమవారం 23 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 23 October 2023 | Rs

ప్రజా సమస్యలపై పోరాడేవారు

సంఘ వ్యతిరేక శక్తులా?

- ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్

• లోపలి పేజీలో.. •

విజయదశమి సందర్భంగా పాఠకులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటనకర్తలకు , ఏజెంట్లకు ప్రజాశక్తి శుభాకాంక్షలు.

సోమవారం మా కార్యాలయానికి సెలవు.

మంగళవారం సంచిక వెలువడదు.

పునర్దర్శనం బుధవారం.

- చీఫ్ జనరల్ మేనేజర్

త్వరలో బయటకొస్తా!



- తరువాత పూర్తిస్థాయి మ్యానిఫెస్టో
- టిడిపి అధినేత చంద్రబాబు
- జైలు నుంచి ప్రజలకు బహిరంగ లేఖ

• లోపలి పేజీలో.. •

కేంద్రం చేతిలో రాష్ట్రాల గుట్టు

- తెరపైకి కొలాబ్ ఫైల్స్ సాఫ్ట్‌వేర్
- రాష్ట్ర సమాచారం ఇకపై ఇందులో అప్‌లోడ్
- తాజాగా విజయవాడలో నోడల్ అధికారులకు శిక్షణ

• లోపలి పేజీలో.. •

'ఆ' మందులే కొనండి

- అవసరం లేకపోయినా ఇండెంట్ పెట్టండి
- ఇఎస్ఐలో ఉన్నతాధికారుల ఆదేశం
- ఒక మంత్రి ఒత్తిడి కారణమని అనుమానాలు

• లోపలి పేజీలో.. •

విజయనగరంలో కరువు ఛాయలు

- 80 వేల ఎకరాల్లో ఎండిన వరి
- తగ్గిన మొక్కజొన్న దిగుబడి
- వెంటాడుతున్న వర్షాభావం
- అధ్వానంగా సాగునీటి కాలువలు

వేపాడ మండలం డబ్బిరాజుపేటలో ఎండిపోతున్న వరి పొలం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో కరువు ఛాయలు అమలుకుంటున్నాయి. సుమారు లక్ష ఎకరాల్లో సాగునీటి ఎద్దడి కనిపిస్తోంది. వర్షాభావం వెంటాడడంతోపాటు జలాశయాల కాలువల నిర్వహణ అధ్వానంగా ఉండడం ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వరి పంట ఎండిపోతోంది. దీంతో, రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ఈ నెలలో జిల్లాలో చినుకు కూడా రాలలేదు. మరో పది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లా కరువుకాటుకు గురైనట్టేనని రైతులు, ఎపి రైతు సంఘం నాయకులు చెబుతున్నారు. జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టులేవీ లేవు. చంపావతి, వేగావతి, సువర్ణముఖి, గోముఖి వంటి నదులు, అనేక జీవగెడ్డలతోపాటు రాష్ట్రంలో మరెక్కడా లేనన్ని చెరువులు ఉన్నాయి. కానీ, వాటి నిర్వహణను పాలకులు పూర్తిగా గాలికి వదిలేయడంతో జిల్లాలో చాలావరకు వర్షాధారంగానే సాగు చేయాల్సి వస్తోంది. మరోవైపు జలాశయాల్లో కాస్త నీటిమట్టాలు తగ్గినప్పటికీ ఉన్న నీటిని సరఫరా చేసేందుకు కాలువల నిర్వహణ సరిగా లేదు. దీంతో, జిల్లాలో పంటల సాగు దినదినగండంగా మారింది. జిల్లా వాసులకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలిపి ఈ ఏడాది 2,83,912 ఎకరాల్లో సాగవగా, అత్యధికంగా వరి 2,34,437 ఎకరాల్లో సాగులో ఉంది. ఇందులో లక్ష ఎకరాల వరకు నీటి ఎద్దడి నెలకొంది. మొత్తం పంట విస్తీర్ణంలో 80 వేల ఎకరాల్లో వరి ఎండుతోంది. పది వేల ఎకరాల్లో మొక్కజొన్న దిగుబడి తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. ఇంకో పది వేల ఎకరాల వరకు పత్తి, అపరాలు, చిరుధాన్యాల సాగు దిబ్బతినే ప్రమాదం ఉంది. క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల ఎండిన పంటలను పరిశీలించినప్పటికీ విస్తీర్ణాన్ని తక్కువగా చూపారు. ఈ ఏడాది తోటపల్లి జలాశయం ద్వారా 78,563 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, 45 వేల ఎకరాలకు మాత్రమే అందినట్టు వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అధికారులు తెలియజేశారు. ఆచరణలో ఇంత కూడా లేదని రైతులు చెబుతున్నారు. ఇతర జలాశయాల పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది. కాలువల నిర్వహణ సరిగా లేకపోవడం, పలుచోట్ల పిల్లల కాలువలు లేకపోవడం వంటివి ఇందుకు కారణం.

సగానికి తగ్గిన మొక్కజొన్న దిగుబడి

జిల్లాలో గుర్ల, మెరకముడిదాం, చీపురుపల్లి, గరివిడి, పూసపాటిరేగ మండలాల్లో మొక్కజొన్న ఎక్కువగా సాగవుతోంది. గతేడాది ఆ మండలాల్లో ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది 15 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గుర్లలో వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టిన పంటకోత ప్రయోగంలో కూడా ఇదే విషయం స్పష్టమైనట్టు జిల్లా వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు తెలిపారు.

ఆది నుంచి అవస్థలే

సీజన్ ముగిసే నాటికి సాధారణ వర్షపాతం నమోదైనా, జూన్‌లో 52 మిల్లీమీటర్లు, ఆగస్టులో 24 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం ఉంది. నాట్లు వేయడానికే రైతులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. అక్టోబర్‌లో ఇంతవరకూ వర్షాలు పడలేదు. 90 మిల్లీమీటర్ల లోటువర్షపాతం ఉంది. దీనికితోడు ఎండ తీవ్రత కూడా ఎక్కువగా ఉండడంతో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలన్నీ ఎండిపోతున్నాయి. అక్కడక్కడా పంట పొలాలు ఇప్పటికే బీటలు వారుతున్నాయి. ముఖ్యంగా వరి వెన్ను దశలో, అక్కడక్కడా పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో పుష్కలంగా నీరు అవసరం. నీటి ఎద్దడి వల్ల దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో జలాశయాల్లో ఉన్న కొద్దిపాటి నీటిని అందించేందుకు కాలువలు ఉన్నంతలో బాగుచేయించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం పట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

వారంలో వర్షం పడకుంటే అంతే!

నాకున్న 1.5 ఎకరాల పొలంలో వరి సాగు చేస్తున్నాను. రూ.40 వేలు మదుపైంది. పంటంతా పొట్ట దశకు చేరుకుంటోంది. ఇప్పటివరకు చెరువు నీరు వాడాను. చెరువులో నీరు ఖాళీ కావడంతో వర్షం కోసం ఎదురు చూస్తున్నాను. వర్షం పడి పంట పండితే సుమారు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. ఈ వారం రోజుల్లో వర్షం పడకపోతే పంట పూర్తిగా ఎండిపోయి తీవ్రంగా నష్టపోతాను. అప్పులే మిగులుతాయి.

– శ్రీను, రైతు, పోరాం గ్రామం, పూసపాటిరేగ మండలం

సాగునీరు లేక ఎం.సీతారాంపురంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

శివారు భూములకు నీరివ్వండి : సిపిఎం

- ఎండిన వరి పంటల పరిశీలన

ప్రజాశక్తి-వంగర (విజయనగరం జిల్లా)

తోటపల్లి ప్రాజెక్టు కుడి కాలువ శివారు ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించి, వంగర మండల రైతులను ఆదుకోవాలని సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా వంగర మండలంలోని ఎం.సీతారాంపురం, మద్దివలస, కొత్తవలస, వంగర, తలగాం, శివ్వాం గ్రామాల్లో ఆదివారం సిపిఎం బృందం పర్యటించింది. సాగునీరందక ఎండిపోతున్న వరిపొలాలను పరిశీలించింది. పిచ్చిమొక్కలతో నిండిపోయిన సాగునీటి కాలువలను బృందం సభ్యులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సాగునీరులేక ఇబ్బందులు పడుతుంటే అధికారులుగానీ, ప్రజా ప్రతినిధులుగానీ పంటలను పరిశీలించలేదని తెలిపారు. సమస్యలను అడిగే వారు కరువయ్యారని సిపిఎం బృందం ముందు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

అనంతరం తమ్మినేని మాట్లాడుతూ సాగునీరు అందకపోవడంతో వరి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. మడ్డువలస ప్రాజెక్టు, నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు ఉన్నప్పటికీ వంగర మండల రైతులకు సాగునీరు అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టం చేశారు. పంటలు ఎండిపోయి రైతులు గగ్గోలు పెడుతుంటే అధికారులెవరూ ఇంతవరకు పంటలను పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పకపోవడం దారుణమన్నారు. తక్షణమే వంగరను కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 25న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మరడాన త్రినాథరావు, వియ్యపు లక్ష్మునాయుడు, గడసాన దుర్గారావు పాల్గొన్నారు.

'ఉక్కు' రక్షణ.. ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి – ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి పోరాటంలో పాల్గొనాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 983వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి అనుబంధ ఉక్కు శ్రామిక సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ని అమ్మాలని చూడడం తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టడమే అవుతుందని అన్నారు. విశాఖ ఉక్కు రక్షణపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని విమర్శించారు. కార్మికుల పోరాటం పెద్ద ఎత్తున సాగుతున్నా కేంద్ర ప్రభుత్వం మౌనం దాల్చడం తగదని అన్నారు. నాయకులు ఎం కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ త్యాగాలతో ఏర్పడ్డ ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకునేందుకు ప్రజా ప్రతినిధులు చొరవ ప్రదర్శించాలని కోరారు. నేటికీ ఎనిమిది వేల మంది ఉక్కు నిర్వాసితులు ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని, ప్లాంట్‌లో వారికి శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కరణం సత్యారావు, బొడ్డు రమణ, పెంటారావు, బి చిన్నారెడ్డి, బి కోటేశ్వరరావు, నరేష్, తిరుపతిరావు, అప్పలనాయుడు, గంటా తాతబాబు, పేర్ల నూకరాజు, వి సన్యాసిరావు, అప్పారావు పాల్గొన్నారు.

క్యూలైన్లో వేచి ఉన్న యాత్రికులు

శ్రీ దుర్గాదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం

- ఎనిమిదో రోజుకు చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి – వన్‌టౌన్ (విజయవాడ)

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు దుర్గాదేవిగా దుర్గమ్మను అలంకరించారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున దర్శనానికి వచ్చారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచే అమ్మవారి దర్శనం కోసం యాత్రికులు క్యూ లైన్ల ద్వారా కొండపైకి చేరుకున్నారు. సుమారు లక్ష మందికిపైగా దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దుర్గమ్మను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్ర కుమార్, ఎపిఎస్‌పిఎఫ్ ఐజి టి.వెంకటరామి రెడి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు.

సాయికార్తీక్ మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న గాలింపు బృందం

గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

- విషాదాంతమైన విహారయాత్ర

ప్రజాశక్తి- తాళ్లరేవు (కాకినాడ జిల్లా)

విహారయాత్రలో సరదాగా గడుపుదామని వచ్చిన యువకుల ఉదంతం విషాదాంతమైంది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంక పుష్కర ఘాట్ వద్ద శనివారం గల్లంతైన నలుగురు యువకుల మృతదేహాలు ఆదివారం గాలింపు బృందం వెలికి తీసింది. వారి మృతదేహాలు స్నానం చేసిన ప్రాంతంలోనే లభ్యమయ్యాయి.

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన సజ్జాపురం గ్రామానికి చెందిన పలువురు యువకులు గోదావరి ప్రాంతాన్ని తిలకించాలని గోపులంక పుష్కర ఘాట్‌కు వచ్చారు. వృద్ధ గౌతమి నదిలో పుష్కర్ ఘాట్ చెంతన స్నానం చేస్తున్న సమయంలో ఒక యువకుడు వేగంగా నదిలోకి దూకాడు. అతడు మునిగిపోతుండగా మిగిలిన ముగ్గురు యువకులూ ఆయనను రక్షించడానికి వెళ్లి వారూ మునిగిపోయారు. వారు స్నానం చేస్తున్న ప్రాంతంలో సుమారు 30 అడుగుల లోతు ఉంటుంది. ఒడ్డు దగ్గరలో స్నానం చేస్తున్న మరో ముగ్గురు యువకులు పక్కనే ఉన్న కొబ్బరి మట్టల సాయంతో వారిని రక్షించడానికి విశ్వప్రయత్నాలు చేశారు. అయినా, ఫలితం లేకపోయింది. వారి కళ్లముందే గోదావరి ఒడిలో ఆ నలుగురు యువకులు గల్లంతవ్వడంతో దిక్కుతోచని స్థితిలో అదే కొబ్బరి మట్టలు పట్టుకుని ఆ యువకులు గోదారి ఒడ్డుకు చేరుకున్నారు. తిరుమల రవితేజ (21), పెండ్యాల బాలాజీ (20), ముద్దన ఫణీంద్ర గణేష్ (20), అనుమకొండ సాయి కార్తీక్ (20) మృతి చెందిన వారిలో ఉన్నారు. నలుగురు యువకుల్లో ఇద్దరి మృతదేహాలు ఆదివారం ఉదయమే మత్స్యకారుల వలకు చిక్కగా, అనుమకొండ సాయి కార్తీక్, రవితేజ మృతదేహాలను నీటి అడుగు నుంచి స్కూబా డైవింగ్ నిపుణుడు ప్రకాష్ వెలికి తీశారు. పెండ్యాల బాలాజీ డిగ్రీ, ఫణీంద్ర గణేష్, సాయి కార్తీక్... తాడేపల్లిగూడెంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. అనుమకొండ సాయి కార్తీక్... పాలిటెక్నిక్ మధ్యలో మానేసి ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నారు. గాలింపు చర్యల్లో కాకినాడ ఫైర్ ఆఫీసర్లు వి.సుధీర్, బి.ఏసుబాబు, ఎస్‌డిఆర్‌ఎఫ్ ఎస్ఐ మహేంద్ర, ఎఎస్ఐ చాంద్‌కుమార్, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు. యువకుల మృతదేహాలను కాకినాడ జిజిహెచ్‌కు పోలీసులు తరలించారు.

83 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జీఓ ఆర్‌టి నెంబరు 2072ని ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు 26 జిల్లాల్లో 83 మంది డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ నెల 19న జిఓ ఆర్‌టి నెంబరు 2057 ద్వారా 60 మందిని ప్రభుత్వం బదిలీ చేసింది. మూడు రోజులు తిరగకుండానే ప్రభుత్వం పెద్ద ఎత్తున బదిలీలు చేపట్టడం పట్ల రెవెన్యూ యంత్రాంగంలో చర్చనడుస్తోంది. మొత్తం మీద ఈ వారంలోనే 143 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీలు చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా – 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సిఎం వ్యాఖ్యలు సరికాదు : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విపక్షాలు, మీడియా ప్రతినిధులను అసాంఘిక శక్తులుగా పేర్కొంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సిపిఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు దుర్మార్గమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలను, ప్రశ్నించే గొంతులను అణగదొక్కేందుకు కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి ఏమాత్రం తీసిపోని విధంగా జగన్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఎండగడుతున్న వారిపై దాడులు చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని, మరోవైపు రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలపై, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, పత్రిక, మీడియా సంస్థలపై జగన్ ప్రభుత్వం సిఐడి, పోలీసులను ప్రయోగించి ఉక్కుపాదం మోపుతోందన్నారు. దాడులు, అక్రమ కేసులు, బెదిరింపులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వ అసమర్ధ, అవినీతి, అభివృద్ధి నిరోధక చర్యలను ఎండగడుతున్న మీడియాను నియంత్రించాలనే దుర్దేశపూర్వకంగా జగన్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లుగా అర్థమవుతోందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు లేఖ కారాగారం నుంచి కాదు

- సూపరింటెండెంట్ రాహుల్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సంతకంతో స్నేహ బ్లాక్, రాజమహేంద్రవరం జైలు పేరున సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న లేఖ జైలు నుంచి జారీ చేసినది కాదని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కారాగార నియమావళి ప్రకారం ముద్దాయిలు ఎవరైనా సంతకం చేసిన కరపత్రాలు బయటకు విడుదల చేయదలిస్తే ఆ పత్రాన్ని జైలు అధికారులు పూర్తిగా పరిశీలించి, జైలర్ ధ్రువీకరించి, సంతకం, కారాగార ముద్రతో సంబంధిత కోర్టులకు, ఇతర ప్రభుత్వ శాఖలకు, కుటుంబ సభ్యులకు పంపుతామని పేర్కొన్నారు. చంద్రబాబు పేరుతో సర్క్యులేట్ అవుతున్న కరపత్రానికీ, ఈ కారాగారానికీ ఏ విధమైన సంబంధమూ లేదని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.

శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో నిర్లక్ష్యం

- రాష్ట్ర సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మాట్లాడుతున్న లక్ష్మణరావు

ప్రజాశక్తి-బాపట్ల

విభజన తరువాత పరిశోధనా రంగం అభివృద్ధిలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడి ఉందని శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. భారతదేశంలో ఆవిష్కృతమైన పరిశోధనా సంస్థల నిర్వహణ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. 'శాస్త్ర సాంకేతిక రంగాల అభివద్ధి..అవరోధాలు' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు బాపట్లలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం జరిగింది. ఈ సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి పట్ల ఇదే విధమైన పరిస్థితి కొనసాగితే శాస్త్రీయ దక్పథం ఎలా అభివద్ధి చెందుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తర్వాత పరిశోధనారంగం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి ఉందని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని దెబ్బతీసే ఆలోచనా విధానంతో ప్రభుత్వాలు అవలంబిస్తోన్న ధోరణి ఏమాత్రమూ సమర్ధనీయం కాదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 పరిశోధనా కేంద్రాలు పనిచేస్తున్నాయని, వాటి నిర్వహణ కోసం రూ.11,500 కోట్లు మంజూరు చేయాల్సి ఉంటే.. కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని వెల్లడించారు. పరిశోధనా రంగం అభివృద్ధి చెందకపోతే భవిష్యత్తులో భారతదేశ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. ఇస్రోలో కీలకమైన పరిశోధన ఫలితాల వెనుక ఎందరో శాస్త్రవేత్తల అవిరళ కషి ఉందని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎం.గేయానంద్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి పాలకులు నిరోధకంగా మారుతున్నారన్నారు. శాస్త్రీయ దక్పథంతోనే విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి పటిష్టమైన పునాదులు పడతాయని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ భారతదేశం తరువాత స్వాతంత్ర్యం పొందిన చైనాలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివద్ధి చెందిందని తెలిపారు. ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అవసరమనే అంశాన్ని ప్రభుత్వాలు మర్చిపోతున్నాయని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు, విశ్రాంత ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కష్ణమోహన్, జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసంగించారు.

సమగ్ర శిక్ష సిబ్బందికి 3 నెలలుగా అందని వేతనాలు

- 24న కొబ్బరి చిప్పలతో నిరసన : బాలకాశి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్ర శిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు అందకపోవడం నానా యాతన పడుతున్నారు. పండుగ వేళ కూడా పస్తులుండాల్సిన దౌర్భాగ్య స్థితిలోకి రాష్ట్ర ప్రభుత్వం వారిని నెట్టివేస్తోంది. సమగ్ర శిక్షలో 25 వేల మంది కాంట్రాక్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తూన్నారు. వీరికి మూడు నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఎం బాలకాశి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వెంటనే అదేశాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం బడ్జెట్ విడుదల చేయాల్సివుందని, ఇది ఇప్పటి వరకూ విడుదల చేయకపోగా..కేంద్రం ఇచ్చిన రూ.300 కోట్ల మొత్తాన్ని కూడా విడుదల చేయడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఈ నెల 24న పండుగ రోజే కొబ్బరి చిప్పలు పట్టుకొని కుటుంబ సభ్యులతో కలిసి ఉద్యోగులు నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ తరువాత నేరుగా 'జగనన్నకు చెబుదాం' పేరుతో ముఖ్యమంత్రి ఇంటి వద్దే నిరసన చేపడుతామని పేర్కొన్నారు.

తీవ్రస్థాయిలో సాగునీటి వెతలు

- అన్నదాతల కష్టాలపై పోరాడుదాం • టిడిపి శ్రేణులకు లోకేష్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి కోసం రైతులు వెతలు పడుతున్నారని టిడిపి ప్రధానకార్యదర్శి నారా లోకేష్ ఆందోళన వ్యక్తం చేశారు. అన్నదాతలు ఎదుర్కొంటున్న కష్టాలపై పోరాటం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని పార్టీ నేతలను ఆయన ఆదేశించారు. శని, ఆదివారాల్లో టిడిపి స్ట్రాటజీ కమిటీ లోకేష్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీల నిలిపివేయడం, సాగు ఖర్చులు అమాంతం పెరిగిపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్న అన్నదాతలపై కరువు పరిస్థితులు తీవ్ర ప్రభావం చూపాయని ఆయన పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలపై చర్చించాలని సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ, జలవనరుల శాఖలను పూర్తిగా మూసేశారని, కష్టకాలంలో రైతులను ఆదుకునేందుకు కనీస స్థాయిలో కూడా ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా దాదాపు 24 లక్షల ఎకరాల్లో సాగు తగ్గిందని చెప్పారు. సాగు చేసిన పంటలు కూడా నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో 70 నుంచి 80 శాతం వర్షపాతం లోటు ఉందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఆస్పత్రికి వెళ్తూ నరసరావుపేట జూలకల్లు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆనంద్‌ది ప్రమాదం కాదని, సర్కారీ హత్య అని టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రచారానికి వేలకోట్లు తగలేస్తూ జగనన్న సురక్ష అని డబ్బా కొట్టుకుంటూ ఆస్పత్రిలో కనీస వైద్యసదుపాయాలు కల్పించని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. చిలకలూరి పేట ఎమ్మెల్యే, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని సొంత జిల్లాలోనే పరిస్థితి ఇలావుంటే రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితులు ఇంకెంత దారుణంగా ఉన్నాయో చెప్పక్కర్లేదని ఆయన పేర్కొన్నారు.
- 'జగనాసురుడి పాలనకు అంతం పలికి దసరా చేసుకుందా'మని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో కోరారు. 'జగనాసురుడి పీడ పోవాలని నినదిస్తూ విజయదశమి రోజు శపథం చేద్దామ'ని తెలిపారు. సైకో పోవాలిసైకిల్ రావాలి నినాదంతో రాత్రి 7 గంటల నుంచి ఐదు నిమిషాల పాటు ప్రతి గడపన శపథం పూనుదామని ఆయన కోరారు.

పొగాకు సాగుకు వర్షాభావం దెబ్బ

- పెరిగిన పెట్టుబడులు, తగ్గనున్న దిగుబడి

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఈ ఏడాది పొగాకు సాగుకు వర్షాభావం తీవ్ర ప్రతిబంధకంగా మారింది. రాష్ట్రంలో 1.60 లక్షల ఎకరాల్లో పొగాకు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 50 శాతం విస్తీర్ణంలోనే సాగులో ఉంది. వర్షాభావం వల్ల గుంటూరు, ప్రకాశం నెల్లూరు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పొగాకు సాగు జాప్యం జరుగుతోంది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో బోర్ల ద్వారా నీటి వనరులు అందుబాటులో ఉండడం వల్ల పెద్దగా ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రస్తుతం సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ట్రాక్టర్లతో నీరు తెచ్చి భూమిని తడిపి పొగాకు నాటుతున్నారు. ఆ తర్వాత మొక్కలు నిలదొక్కుకోవడానికి ఎరువులు, నీటిని వినియోగిస్తున్నారు. ఇందుకోసం ఎకరాకు అదనంగా రూ.6 నుంచి రూ.10 వేల వరకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని రైతులు చెప్తున్నారు. కొన్ని మండలాల్లో ఎండల తీవ్రత వల్ల మొక్కలు నిలదొక్కుకోవడం లేదు. దీంతో, నాట్లు వేసిన కొద్ది రోజులకే ఎండిపోయిన పైరును తొలగిస్తున్నారు. ప్రకాశం జిల్లా పొదిలి ప్రాంతంలో ఇటీవల వంద ఎకరాల్లో పైరు ఎండిపోవడంతో రైతులు తొలగించారని అధికారవర్గాలు తెలిపాయి. వర్షాభావం వల్ల అధిక ఖర్చుతోపాటు దిగుబడి గణనీయంగా తగ్గనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సానుకూలమైన వాతావరణం ఉంటే ఎకరాకు కనీసం 9 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రతికూల వాతావరణం వల్ల దిగుబడి రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా డిసిపల్లి, కలిగిరి, ప్రకాశం జిల్లా పొదిలి, కందుకూరు, కొండేపల్లి, మార్టూరు తదితర ప్రాంతాల్లో పొగాకు సాగు జరుగుతోంది. గత ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో ఏర్పడిన డిమాండ్ వల్ల రైతులకు కొంత వరకు మేలు జరిగింది. ఈ ఏడాది వర్షాభావం వల్ల అధిక ఖర్చు, దిగుబడి నష్టం రెండు భారంగా మారనున్నాయని రైతు నాయకులు చుండూరు రంగారావు తెలిపారు. ఒక్కో బ్యారెన్ పరిధిలో ఆరేడు ఎకరాల వరకు సాగవుతుందని, దాదాపు రూ.70 వేల వరకు అదనపు పెట్టుబడి అవుతోందని తెలిపారు. దిగుబడి తగ్గడం వల్ల మరో రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు నష్టం ఉంటుందని అభిప్రాయపడ్డారు. గుంటూరు జిల్లా చిలకలూరిపేట ప్రాంతంలో కూడా వర్షాభావం వల్ల పొగాకు నాట్లు ఎండిపోతోంది. దీంతో, రైతులు ట్రాక్టర్ల ద్వారా నీటిని తెచ్చుకొని నాట్లు వేస్తున్నారు.

పల్నాడు జిల్లా చిలకలూరిపేట ప్రాంతంలో ట్రాక్టర్ల ద్వారా నీరు చల్లి, పొగాకు పైరు వేస్తున్న రైతు

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 83 | విజయవాడ, సోమవారం 23 అక్టోబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Monday 23 October 2023 | Rs

బన్నీ ఉత్సవానికి భారీ బందోబస్తు

- 1100 మంది పోలీసులతో పహారా
- అగ్గి దివిటీలు, ఇనుప రింగులు తొడిగిన కర్రలపై నిషేధం
- దేవరగట్టులో ఈసారైనా కర్రల సమరం ఆగేనా?

లోపలి పేజీలో..

విజయదశమి సందర్భంగా పాఠకులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటనకర్తలకు , ఏజెంట్లకు
ప్రజాశక్తి శుభాకాంక్షలు.
సోమవారం మా కార్యాలయానికి సెలవు.
మంగళవారం సంచిక వెలువడదు.
పునర్దర్శనం బుధవారం.
- చీఫ్ జనరల్ మేనేజర్

శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో నిర్లక్ష్యం

- రాష్ట్ర సదస్సులో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజారక్షణ భేరి

లోపలి పేజీలో..

ఢిల్లీలో క్షీణిస్తున్న వాయు నాణ్యత

లోపలి పేజీలో..

పొగాకు సాగుకు వర్షాభావం దెబ్బ

- పెరిగిన పెట్టుబడులు, తగ్గనున్న దిగుబడి

లోపలి పేజీలో..

పల్నాడు జిల్లా చిలకలూరిపేట ప్రాంతంలో వర్షాభావం వల్ల దెబ్బతిన్న పొగాకు పైరు

ప్రజా సమస్యలపై పోరాడేవారు సంఘ వ్యతిరేక శక్తులా?

- ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేవారిని, ప్రజా సమస్యలపై ఆందోళన చేసే వారిని సంఘ వ్యతిరేక శక్తులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివర్ణించడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు.

సిపిఎం అభిప్రాయాన్ని ఆదివారం తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు.. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారి గొంతు నొక్కడానికి, ప్రతిపక్షాలను అణచివేయడానికి చేసే ప్రయత్నంలో భాగమే ఇటువంటి ప్రేలాపనలు అని విమర్శించారు. పోలీస్ అమరవీరుల సభను దీనికి వేదికగా ఉపయోగించుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ నిర్వచనాలు ప్రజాస్వామ్యానికే ప్రమాదం అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోడీని వ్యతిరేకించేవారందరూ దేశద్రోహులుగా బిజెపి చిత్రీకరించినట్లుగా, మీడియా సంస్థలు వైర్, న్యూస్‌క్లిక్‌పై దాడులు చేసి జర్నలిస్టులను ఉగ్రవాదులుగా ముద్ర వేసినట్లుగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కూడా ఆ మోడీని అనుసరిస్తున్నట్లుగా ఉందన్నారు. అసాంఘిక శక్తుల నిర్వచనాన్ని మార్చాలని ఆయన చేసిన ప్రతిపాదన సంఘ వ్యతిరేక శక్తులకే తోడ్పడుతుందని పేర్కొన్నారు. దాడులు చేస్తున్నవారు, హత్యలు చేస్తున్నవారు, అత్యాచారాలు చేస్తున్నవారు, ప్రజాధనాన్ని లూటీ చేసే వారిని వదిలేసి ప్రజా సమస్యలపై పోరాడేవారిని అసాంఘిక శక్తులతో పోల్చడం ముఖ్యమంత్రికి తగదన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసనలను, భిన్నాభిప్రాయాలను గౌరవించే ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ముందుకు రావాలని ప్రజాస్వామ్యవాదులకు, మేధావులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

'ఆ' మందులే కొనండి

- అవసరం లేకపోయినా ఇండెంట్ పెట్టండి
- ఇఎస్ఐలో ఉన్నతాధికారుల ఆదేశం
- ఒక మంత్రి ఒత్తిడి కారణమని అనుమానాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇఎస్ఐలో మరో మందుల స్కామ్‌కు తెరలేచిందా? తాజా పరిణామాలతో ఇఎస్ఐ సిబ్బందిలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కొన్ని కంపెనీల మందులే కొనుగోలు చేయాలని, అవసరం లేకపోయినా తప్పనిసరిగా ఇండెంట్ పెట్టాలన్న ఆదేశాలు ఇఎస్ఐలో జారీ అయ్యాయి. ఈ రెండు, మూడు నెలల్లోపే సుమారు రూ.40 కోట్ల నుండి రూ.45 కోట్ల వరకూ విలువైన మందుల కొనుగోలు చేయాలని, ఆ మేరకు ఇండెంట్ పెట్టాలని అన్ని డిస్పెన్సరీలకు, సూపరింటెండెంట్లకు ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఈ ఆదేశాల వెనుక ఒక మంత్రి హస్తం ఉందన్న అనుమానాలు సిబ్బందిలో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకూ రోగులకు అవసరమైన 279 రకాల మందులనే కొనుగోలు చేస్తుండగా తాజాగా 900 రకాల మందులు కొనుగోలు చేయాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. అదికూడా గ్లెన్‌మార్క్, శారిడా, జాన్సన్‌అండ్‌జాన్సన్, జిమ్ కంపెనీల నుండి మాత్రమే కొనుగోలు చేయాలంటూ పేర్కొన్నారని చెబుతున్నారు. ఈ ఆదేశాలపై కిందిస్థాయిలో వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇఎస్ఐ మందుల కుంభకోణం వెలుగులోకి వచ్చిన సమయంలో కార్మికశాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం డిస్పెన్సరీలకు వచ్చే రోగులు వారికి వినియోగిస్తున్న మందులకు సంబంధించి 279 రకాలు మాత్రమే అవసరమౌతాయని నిర్ధారించి, ఆ మేరకే కొనుగోలు చేయాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేసి దానిలోనే ఇండెంట్ పెట్టాలని నిర్దేశించారు.

తాజా ఆదేశాల్లో ఇలా...

తాజా ఆదేశాల్లో స్క్రూటినీ కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు మెడికల్ ఆఫీసర్లు ఇండెంట్లు పెట్టాలని తాజా ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. ఆన్‌లైన్ పోర్టల్‌లో కాకుండా నేరుగా వచ్చి ఇండెంట్ ఇవ్వాలనీ సూచించినట్లు తెలిసింది. ఈనెల 11వ తేదీన 1955303/సిడిఎస్/డిఐఎంఎస్/2023 ఆర్‌సి నెంబరుతో ఈ మేరకు కడప, రాజమహేంద్రవరం, ఆదోని, విజయవాడ సూపరింటెండెంట్లకు, మెడికల్ ఆఫీసర్లకు ఆదేశాలు అందాయి. 45 కోట్ల రూపాయల మేరకు ఈ కొనుగోళ్లు ఉంటాయని అంచనా! ఇటీవల జరిగిన ఒక సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలోనూ ఇలాగే మందులు కొనుగోలు చేసి వాటి సమయం గడిచిపోవడంతో పారేశారని, ఇప్పుడూ అదే పరిస్థితి వస్తుందన్న అభిప్రాయాన్ని ఆ సమావేశంలో కొందరు సీనియర్ మెడికల్ ఆఫీసర్లు వ్యక్తం చేసినట్లు తెలిసింది. నిజంగా ఖర్చు చేయాలనుకుంటే ఇప్పటికే ఉన్న ఆస్పత్రుల్లో సదుపాయాలు కల్పించాలని, సూపర్ స్పెషలిస్టుల సంఖ్యను పెంచితే ఉపయోగమని సూచించినట్లు తెలిసింది. అయితే, ఉన్నతాధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా కొనుగోలు చేయాల్సిందేనని హుకుం జారీచేసినట్లు తెలిసింది.

వృద్ధా ఇలా ...

ఉదాహరణకు జిమ్ కంపెనీ నుండి ఎక్కువగా మల్టీవిటమిన్

మిగతా 5లో

వరి ఎండుతోందని ఉరితాళ్లతో రైతుల నిరసన

లోపలి పేజీలో..

సరుకు ఎలా తరలించాలా!

- తవ్విన తెల్లరాయిని అడవుల్లోనే వదిలివెళ్లిన మాఫియా
- 'ప్రజాశక్తి' కథనంపై రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆరా

త్వరలో బయటకొస్తా!

- తరువాత పూర్తిస్థాయి మ్యానిఫెస్టో
- టిడిపి అధినేత చంద్రబాబు
- జైలు నుంచి ప్రజలకు బహిరంగ లేఖ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓటమి భయంతో జైలు గోడల మధ్య బంధించి ప్రజలకు తనను దూరం చేశామనుకుంటున్నారని, త్వరలోనే తాను బయటకు వస్తానని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆయన జైలు నుంచి ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. 'నేను ప్రస్తుతం ప్రజల మధ్యలో లేకపోవచ్చు, అభివృద్ధి రూపంలో ప్రతీ చోటా, సంక్షేమం పేరు వినిపించిన ప్రతీసారి తన పేరే తలుస్తారు. తాను జైలులో లేను, ప్రజల హృదయాల్లో ఉన్నాను. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రజాచైతన్యంలో ఉన్నాను, విధ్వంస పాలనను అంతం చేయాలనే ప్రజా సంకల్పంలో ఉన్నాను.'.. ఇలా సాగిపోయింది ఆ లేఖ. చంద్రబాబు ఆ బహిరంగ లేఖను ములాఖత్‌లో తన కుటుంబ సభ్యులకు అందించగా, టిడిపి ఆదివారం నాడు ఇక్కడ విడుదల చేసింది. జైలు గోడల మధ్య కూర్చుని ఆలోచిస్తూ ఉంటే 45 ఏళ్ల ప్రజా జీవితం తన కళ్ల ముందు కదలాడుతోందని ఆ లేఖలో పేర్కొన్నారు. తెలుగు ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తన రాజకీయ ప్రస్థానమంతా సాగిందని తెలిపారు. మీ నుంచి ఒక్క రోజు కాదు కదా ఒక్క క్షణం కూడా ఎవరూ తనను దూరం చేయలేరంటూ గంభీరమైన పదజాలాన్ని లేఖ నుండి దట్టించారు. కుట్రలతో తనపై అవినీతి ముద్ర వేయాలని ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చీకట్లు తాత్కాలికమేనని, సత్యం అనే సూర్యుడి ముందు కారుమబ్బులు వీడిపోతాయని పేర్కొన్నారు. సంకెళ్లు తన సంకల్పాన్ని బంధించలేవని, జైలు గోడలు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేవని తెలిపారు. జైలు ఊచలు తనను ప్రజల నుంచి దూరం చేయలేవని పేర్కొన్నారు. త్వరలో బయటకు వచ్చి పూర్తిస్థాయి మ్యానిఫెస్టో విడుదల చేస్తానని చెప్పారు. ప్రజల కోసం, వారి పిల్లల భవిష్యత్తు కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఎప్పుడూ బయటకు రాని తన భార్య భువనేశ్వరిని ప్రజల తరఫున పోరాడాలని కోరారని, అందుకు ఆమె ఒప్పుకున్నారనివివరించారు. తన అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మృతిచెందిన కుటుంబాలను పరామర్శించి, అరాచక పాలనను ఎండగట్టేందుకు 'నిజం గెలవాలి' అంటూ భువనేశ్వరి ప్రజల ముందుకు వస్తారని తెలిపారు. చెడు గెలిచినా నిలవదని, మంచి తాత్కాలికంగా ఓడినట్లు కనిపించినా కాల పరీక్షలో గెలిచి తీరుతుందని తెలిపారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా

బిగిస్తున్న పిడికిళ్లు

- అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ యూనివర్సిటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు
- లండన్‌లో 3 లక్షల మందితో ప్రదర్శన

పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతున్న హార్వర్డ్ యూనివర్సిటీ విద్యార్థులు

లండన్/వాషింగ్టన్: దాదాపు రెండు వారాలుగా నాన్‌స్టాప్‌గా గాజాపై వైమానిక దాడులను కొనసాగిస్తూ, ఇళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, మసీదులు, చర్చిలను నేలమట్టం చేస్తూ, చిన్నారులు, మహిళలతో సహ వేలాది మంది అమాయకులను పొట్టనపెట్టుకుంటున్న ఇజ్రాయిల్ దాష్టీకానికి వ్యతిరేకంగా దేశ దేశాల్లో నిరసనలు హోరెత్తుతున్నాయి. విద్యార్థులు వివిధ యూనివర్సిటీ కేంపస్‌లలో భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అమెరికాలోని పోర్టులాండ, టొరంటో, లాస్ ఏంజెల్స్, బ్రూక్లిన్, చికాగోల్లో వేలాది మంది పాలస్తీనాకు సంఘీభావంగా వీధుల్లోకి వచ్చారు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఇది ఇరవై ఒకటో శతాబ్దం, వలసవాదానికి ఇంకెంతమాత్రమూ స్థానం లేదు అని ప్రదర్శకులు నినదించారు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌తో సహ పలు దేశాల్లో ప్రభుత్వాలు, యూనివర్సిటీ పాలకవర్గాల ఆంక్షలను, నిషేధాలు,నిర్బంధాలను లెక్కచేయకుండా విద్యార్థులు పెద్ద సంఖ్యలో బయటకు వచ్చి పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలియజేస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యూనివర్సిటీల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ (యుకె)లో వేలాది మంది పాలస్తీనా సాలిడారిటీ పేరుతో మార్చ్ నిర్వహించారు. అలాగే ఎడిన్‌బరో , గ్లాస్గో, బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ, శాన్‌ఫ్రాన్సిస్కో,కొలంబియా యూనివర్సిటీలు, మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ,ఫ్రాన్స్‌లోని టౌలోజ్ యూనివర్సిటీ వంటి విశ్వవిద్యాలయాలు విద్యార్థుల ప్రదర్శనలతో హోరెత్తాయి. లండన్‌లో గత శనివారం లక్షన్నర మంది విద్యార్థులు భారీ

మిగతా 5లో

కేంద్రం చేతిలో రాష్ట్రాల గుట్టు

- తెరపైకి కొలాబ్ ఫైల్స్ సాఫ్ట్‌వేర్
- రాష్ట్ర సమాచారం ఇకపై ఇందులో అప్‌లోడ్
- తాజాగా విజయవాడలో నోడల్ అధికారులకు శిక్షణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కొల్లాబ్ ఫైల్స్ అనే సాంకేతిక ఆధారిత డొమైన్‌ను తెరమీదకు తీసుకొచ్చింది. దీంతో భవిష్యత్తులో రాష్ట్రాలకు సంబంధించిన కీలక సమాచారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లనుంది. కొల్లాబ్ ఫైల్స్ సాఫ్ట్‌వేర్ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం చేతిలోని ఎన్ఐసి మానిటరింగ్ చేయనుంది. ఫలితంగా రాబోయో రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో నడవక తప్పని పరిస్థితులు నెలకొనే అవకాశాలు లేక పోలేదు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ నేషనల్ ఇన్ఫొర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసి) కొలాబ్ ఫైల్స్ అనే నూతన పోర్టల్ ను మనుగడ లోకి తీసుకొచ్చింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా నూతన సాఫ్ట్‌వేర్‌ను దేశీయంగా తీసుకొచ్చినప్పటికీ ఇకపై రాష్ట్రాలు, స్థానిక సంస్థలకు చెందిన పరిపాలనాపరమైన ఉత్తర ప్రత్యుత్తరాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు ప్రభుత్వానికి చెందిన పలు రహస్య విషయాలను నూతన సాఫ్ట్‌వేర్‌ద్వారా భద్రపరచాలని కేంద్రం పేర్కొంటోంది.ఇందులో ప్రభుత్వ అధికారులు వారికి కావాల్సిన ఫైల్స్ (వర్డ్, పవర్ పాయింట్ , ఎక్సెల్, పిడిఎఫ్, మరియు ఇతర డాక్యుమెంట్లు, వారి లాగిన్ నుండి ఇతరులకు సులభంగా పంపే విధానాన్ని ఇందులో తీసుకొచ్చారు. తాజాగా సాఫ్ట్ వేర్ ఉపయోగంపై నోడల్ అధికారులకు ఎన్ఐసి శిక్షణ ఇచ్చింది. గత వారంలో విజయవాడలోని ఓ త్రీస్టార్ హోటల్‌లో నూతన సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యక్రమాలన్నీ గుగూల్‌తో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ కంపెనీల సాఫ్ట్‌వేర్ ద్వారా డేటా ను భద్రపరిచే వారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఏమైనా వివరాలు కావాలని కేంద్రం కోరినా కొన్ని రాష్ట్రాలు ఆయా వివరాలు ఇవ్వడం లేదనే వాదన కూడా వినబడుతోంది. కాగ్ లాంటి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలు పేర్కొన్న అభ్యంతరాలను కూడా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సరిచేసుకోవడం లేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొల్లాగ్ ఫైల్స్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా అధికారిక ఫైల్స్‌ను డిజిటలైజేషన్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫైల్స్ ద్వారా సేకరించిన డేటాను రహస్యంగా ఉంచడం, నాలెడ్జ్ షేరింగ్, సురక్షితంగా రికార్డులను ఉంచడంతో పాటు యాక్సెస్ సులభతరం చేయడం సులభంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది.ప్రభుత్వం వీటి యొక్క వినియోగం వారి అధికారిక మెయిల్ ఐడి ద్వారా మాత్రమే జరపాల్సి ఉంటుంది. ఫలితంగా సాంకేతికంగా ఎటువంటి సమస్య

మిగతా 5లో

400 కిలోల బంగారం.. 350 కిలోల వెండి స్వాధీనం

- ప్రొద్దుటూరులో ఐటి దాడులు
- నాలుగు రోజుల పాటు తనిఖీలు

బంగారాన్ని తరలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆదాయపన్ను (ఐటి) అధికారులు అనూహ్యమైనరీతిలో చేపట్టిన తనిఖీలు ఆదివారం ముగిశాయి. భారీ మొత్తంలో అక్రమ దిగుమతులు జరుగుతున్నాయన్న సమాచారంతో నాలుగు రోజులుగా పట్టణంలో ఐటి ఈ తనిఖీలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం..ప్రొద్దుటూరులోని నాలుగు దుకాణాల్లో బిల్లులు లేని సుమారు 400 కిలోల బంగారాన్ని, 350 కిలోల వెండినీ, రూ.2 కోట్ల వరకూ నగదును స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ, తిరుపతికి చెందిన ఐటి అధికారులు ప్రొద్దుటూరులోని బుశెట్టి జువెలర్స్, గురురాఘవేంద్ర, తల్లం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం భారీ ఎత్తున్న బంగారాన్ని సీజ్ చేసి అట్టపెట్టెలు, సూట్ కేసుల్లో భద్రపరిచి వాహనాల్లో తిరుపతికి తరలించారు. ఇతర ప్రాంతాల నుంచి బిల్లులు లేకుండా భారీ ఎత్తున బంగారాన్ని దిగుమతి చేసుకున్నట్లు ఐటిశాఖాధికారులు గుర్తించారు. వీటితోపాటు వజ్రాలు కూడా ఉన్నట్లు సమాచారం. పన్నులు కట్టాల్సిన డబ్బులు సుమారు రూ.170 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 40 మంది అధికారులు 14 కార్లల్లో వచ్చి సోదాలు చేశారు.

బంగారు వ్యాపారంలో ప్రొద్దుటూరు రెండో ముంబయిగా ఖ్యాతి గడించింది. దీంతో భారీగా అక్రమ బంగారం దిగుమతి అవుతోందన్న పక్కా సమాచారంతో అధికారులు నాలుగు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రొద్దుటూరులో దాదాపు రెండు వేలకుపైగా బంగారం, స్వర్ణకారుల దుకాణాలు ఉన్నాయి. ఐటి అధికారుల తనిఖీలతో మిగతా బంగారం వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. తనిఖీలు తమ వరకు వస్తాయన్న ఆందోళనతో బంగారం, స్వర్ణకారులు తమ దుకాణాలను మూసివేశారు. దసరా పండుగ సమయంలో బంగారు దుకాణాలన్నీ మూతపడడంతో కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు నిరాశ చెందారు.

కివీస్‌ను కుమ్మేశారు

- నాలుగు వికెట్లతో భారత్ గెలుపు
- కోహ్లి శతకం మిస్, రోహిత్, జడేజా మెరుపులు
- ప్రపంచకప్ 2023

లోపలి పేజీలో..

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ | సోమవారం 23 అక్టోబర్ 2023

నేనింత పిడికెడు మట్టే
కావొచ్చు
కానీ, కలమెత్తితే
ఒక దేశపు జెండాకు ఉన్నంత
పొగరు ఉంది.

– గుంటూరు శేషేంద్ర శర్మ

మట్టిదీపంలో నెత్తుటి వత్తులు

తమకంటూ ఒక గూడు మిగలకపోయినా
తమ వారికంటూ భద్రమైన
ఒకింత చోటు దక్కకపోయినా
యుద్ధంలో పుట్టి యుద్ధం కోసమే బతికే
ఏ దేశమంటూ లేని ఎవరు ఈ ప్రజలంతా?

ఊపిరి దీపాలెన్ని ఆరిపోతున్నా
ప్రాణమనుకుని, పుట్టిన ఆ మట్టి దీపపు
నెత్తుటి చమురులోనే
వత్తులై వెలుగుతున్నారెందుకు?

ఇల్లొదిలి ఊరొదిలి
సరిహద్దు కంచెల చాటుకి కాందిశీకులై
పరుగులు తీసే ఇన్నిన్ని వేల
రక్తపు ముద్దల నేరమేమిటి?

పవిత్ర భూమి అనుకున్న ఒకే చోట
పుట్టింటి జాడల్ని స్వప్నించే రెండు తెగల్ని
శత్రు శ్మశానాలను కలగనే రెండు జాతుల్నీ
ఒకే జైలు గదిలో బంధించి
ఆయుధాలను తలుపులుగా కిటికీలుగా
అమరుస్తున్నదెవరు?

మధ్యధరాకీ మృత సముద్రానికీ మధ్యలో
నిప్పులా రేగే యుద్ధ కడలి మీద
కన్నీటి కెరటాల ఈ అల్ప పీడన ద్రోణి
సద్దుమణిగే ఒక శాంతి వీచిక ఎప్పుడొస్తుంది?

– కంచరాన భుజంగరావు
94415 89602

మల్ల ఎప్పుడు కానొస్తరో ...

చిన్న దెబ్బ తగిలితే
తండ్లాడుకుంటూ వచ్చిన వాళ్ళే –
ఇప్పుడు నెత్తిగొట్టుకుంటున్నా
మాట వరసకైనా వచ్చి ఓదార్చరు
ఏది అడిగినా
కాళ్ళు దగ్గరకు తెచ్చిన వాళ్ళే –
కాళ్ళు మొక్కి బతిమిలాడినా
చేతుల్ని బిగుసుకొని పడుకుంటరు.

ఎందుకు అలిగింర్రో చెప్పరు
ఎంత పిలిచినా పలుకరు
'ఏడ్వండి, ఇప్పుడు గాక ఇంకెప్పుడేడుస్తరు' అన్నట్టు
నిదురపోతున్నట్టు కనులు మూసుకుంటరు!
వాళ్ళ మీద ఏ తప్పు ఉంచుకోరు
మన చేతులతో మనమే
ఇంట్లో నుంచి వెళ్ళగొట్టినట్టు చేస్తారు
బతుకంతా దోషులుగా నిలబెడుతరు.

ఎన్నడూ ఒకరితోటి
పని చేయించుకోవడం ఎరుగని వాళ్ళే –
బిడ్డలను ముందల నడిపించుకుంటరు
నలుగురితో మోయించుకుంటరు

జ్ఞాపకాలను ఇచ్చిపోతున్నామని అనుకుంటారు గానీ
ముండ్లకంపల నూకేసి పోతున్నరని
వాళ్ళకెట్లా చెబితే అర్థమౌతుంది?
ప్రతి జ్ఞాపకంలోను ఎండమావుల్లా కనబడుతారు
అందుకుందామంటే మాయమౌతారు

ఒక మనిషి పోయినంక
ఎట్లుంటదంటే ఏం చెప్పను?
పచ్చికట్టెల మీద
వరిగడ్డి ఏసుకొని పడుకున్నట్టు ఉంటది.
మల్ల వాళ్ళు ఎప్పుడు కానొస్తరో
పిల్లలకోడిలాగ మన మధ్యన ఎప్పుడు తిరుగుతరో

ఏ మేఘాల మధ్యన నిలబడి
వాన చినుకై రాలుతరో
ఏ మట్టిపొరల మధ్య పడుకొని
బంతిపూల మొక్కై పూస్తరో

ఏ పెత్తరామాస పండుగకు
మనల్ని చూసి పోదామని వస్తరో
మనం పెట్టిన బట్టలను కట్టుకుంటరో, లేదో?
మన చేత రెండు ముద్దలైనా తినిపోతరో, లేదో
మల్ల ఎప్పుడు కానొస్తరో ..!

– తగుళ్ళ గోపాల్
83098 37260

ఆవిష్కృతమౌతోన్న సత్యం

ఒకరి జీవితాన్ని మరొకరు కొల్లగొడితే
ఒకరు ఇంకొకరిపై చెయ్యెత్తితే అది దాడి
దాడికి ప్రతిగా ఒక జాతి జాతినే
ధ్వంసించాలనుకుంటే అది యుద్ధం!

యుద్ధానికి యుద్ధమే
పరిష్కారమంటే అది కపట నీతి
వేల ఏండ్ల కిందట రూపు దిద్దుకున్న
రెండు జాతులు
పరస్పర హననానికి పాల్పడుతుంటే అది అజ్ఞానం

సామ్రాజ్యవాద శక్తులంతా
ప్రపంచ పోలీసులంతా ఒక్కటై
యుద్ధాన్ని యెగదోస్తూ కొమ్ము కాస్తుంటే
అది ఆయుధ వ్యాపారం
పాలస్తీనాది ఉగ్రవాదమని ఇజ్రాయెల్‌ది వీర శౌర్యమని
ప్రసార మాధ్యమాలు ఊదరగొడుతుంటే
అది దుష్ప్రచారం
భూమ్యాకాశ జల మార్గాల దిగ్బంధనంతో
యుద్ధ తుపాను సృష్టిస్తోన్న ఇజ్రాయెల్
చిగురుటాకులా వణుకుతూ
గిలగిల తన్లాడుతోన్న స్ట్రిప్ లాంటి గాజా
తెగిపడిన కంకాళాల మధ్య
విడిపడిన శరీర భాగాల మధ్య
రక్తమోడుతున్న మానవ బంధాల మధ్య
వధ్యశిలలుగా మారిన భవన శిధిలాల మధ్య
కావాలిప్పుడు వసివాడిన
పసిపిల్లల భవిష్యత్తుకు జవాబు !

నీ వలెనే నీ పొరుగువారిని ప్రేమించమన్న
మనుష్యులంతా ఒకటే సంతానమన్న
ఎక్కడ ఆ దైవ కుమారుల అడుగు జాడలు
దైవమూ లేదు
దైవ కుమారులూ లేరన్న
పచ్చినిజం బయటపడుతోంది

ప్రవక్తలూ లేరు వారి
ప్రవచనాలుకు విలువా లేదన్న
వాస్తవం వెలుగులోకొస్తోంది
మనిషిని మనిషే రక్షించుకోవాలనే
మానవత్వ సాక్షాత్కారం అవసరమన్న
సత్యం ఆవిష్కృతమౌతోంది!

– పి. మురళీ కుమార్
93978 73331

పల్లెపదాల్లో పండగ సందడి

పంటలు పొంగారినప్పుడు.. ప్రకృతి పరవశించినప్పుడు... ఆనందం తాండవించినప్పుడు... అందరూ కలగలిసినప్పుడు- సంతోషం వెయ్యింతలై నాట్యమాడుతుంది. మాటలు హార్మోనియం మీటలవుతాయి. పాటలు వాటికవే పల్లవిస్తాయి. కాళ్లు లయాత్మకంగా కదం తొక్కుతాయి. హృదయాలు సరదాల సాగరాలై పోటెత్తుతాయి. ఇలాంటి ఆనందానందపు సందర్భాలనే మనం పండగలు అంటాం. శరత్కాలపు వెన్నెల రాత్రుల్లో .. నిర్మల ఆకాశపు చుక్కల వెలుగుల్లో ... సరదాలను సందిట దాచుకొని వచ్చే దసరా... ఇలాంటి వేలవేల ఎన్నియల పాటల పేటిక. జానపద గానాల కమనీయ వాటిక. పంటలూ ప్రకృతీ ప్రధానంగా ఈ దసరా వేళ .. మన రాష్ట్రంలో ఒకప్పుడు ఘనమైన గైరమ్మ సంబరాలు జరిగాయి. ఇప్పుడు అవి గతం అన్నట్టుగా వైభవం కోల్పోయాయి!

దసరాకు నేపథ్యంగా మనం ఇప్పుడు చెప్పుకుంటున్న కథలు వేరు. మన మూలాలైన పల్లెటూళ్ల ఒకప్పుడు సందడిగా జరుపుకున్న సరదాల సందర్భాలు వేరు. ఊరు ఊరంతా ఉప్పెనలా ఎగిసిన ఆటపాటలకు ప్రకృతే ప్రధాన కారణం. పంటపనులన్నీ పూర్తయ్యి .. పైరుచేలు పచ్చపచ్చగా పరవశించే తరుణమే పర్వదినం. ఒకటి కాదు, రెండు కాదు; ఎనిమితో, తొమ్మిదో అసలే కాదు; వెండి వెన్నెల కాసినంతకాలమూ పండగే అప్పుడు. చుక్కల ఆకాశం, నిండైన పండు వెన్నెల, చక్కని వాతావరణం ... అలాంటప్పుడు ఎవరు మాత్రం ఒంటరిగా బజ్జుంటారు ఇంట్లో? ఒకడు ఆ మూలన రాగమేదో అందుకుంటాడు. ఇటుపక్క ఇంకొకడు మద్దెల దరువవుతాడు. వేరొకడు పిల్లనగ్రోవి పిలుపవుతాడు. ఊరి ఆడపడుచులు ఆనందపు చిందులవుతారు. గుంపు గుంపులుగా ఒక్కచోటకు చేరి .. సంతోషపు సింధువులవుతారు. మరి .. ఆ సామూహిక సందడిలో మాటలు ఎక్కడివి? పాటలు ఎవరివి? ఆటలు ఏ తరహావి. చుట్టూ ఉన్న జీవితమే ఇతివృత్తం. పాడిపంటలూ, చెట్టుచేమలూ, కొన్ని ఆశలూ మరికొన్ని ఆకాంక్షలూ, పంటకు వినతులూ, ప్రకృతికి ఆరాధనలూ ... వారే రచయితలు. వారే సంగీతకారులు. వారే గాయనీగాయకులు.. వారే ప్రేక్షకులూ వీక్షకులూ.. వారే వారే ప్రశంసకులూ విమర్శకులూ. అదే జానపద కళావైభవం. మన జానపదుల జీవన పరమార్థం.

పైరు పరవశించే వేళ ...

సహజంగా అక్టోబరు నెల నాటికి – వర్షాలు కురిసి.. అరకలు నడిచి.. విత్తనాలు మొలకెత్తి .. పంటచేలు పైకెగసి .. ప్రకృతి అంతా హరిత శోభను సంతరించుకుంటుంది. చెరువుల నిండా జలకళ ఉట్టి పడుతుంది. వాగులూ వంకలూ గలగలా పారుతుంటాయి. ఎక్కడ చూసినా రకరకాల పూలు కనువిందు చేస్తూ ఉంటాయి. వ్యవసాయ పనులు కాస్త నెమ్మదిస్తాయి. కొంతకాలం ఇలాగే సాగితే– భీకర వర్షాల్లో, తుపాన్లో రాకుండా ఉంటే– పంటలు చక్కా పండుతాయి. శ్రమ ఫలిస్తుంది. గాదెలు నిండుతాయి. ఊరంతా హాయిగా బతుకుతుంది. అందుకనే అలాంటి ఆశతో ఎదురుచూస్తూ– జానపదులు పాటలు అల్లుకున్నారు. తాము ఆనందంగా గడిపే వేళ ఆటలపాటలతో ప్రకృతిని వేడుకున్నారు. ఇప్పుడు తెలంగాణాలో జరిగే బతుకమ్మ పండగలో కనిపించే పరమార్థం ఇదే! ఇలాంటి జానపద వైభోగం ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో కూడా ఉంది. కాకుంటే– ఒకప్పుడు ప్రబలంగా.. ఇప్పుడు అక్కడక్కడ. కొత్త పండగల ఉరవడిలో పడిపోయి... ఇక్కడి జానపదాలు మూలనపడిపోయాయి. మన మూలాల్లో పల్లవించిన పాటలూ, వాటి సందర్భాలూ ఇప్పుడు ఇక్కడ చాలా తక్కువమందికే తెలుసు. ఇలాంటి వ్యాసాలు రాయటానికి కూడా మనుషుల నుంచి కాక పుస్తకాల నుంచి సమాచారం సేకరించుకోవల్సిన పరిస్థితి!

ఊరూరా గైరమ్మ పాటలూ ఆటలూ

గైరమ్మ సంబరాలు ఒకప్పుడు ఊరూరా ఘనంగా జరిపేవారు. ఉత్తరాంధ్రలో వీటికే నందెన్న ఉత్సవాలు అని పేరు. 21 రోజుల వరకూ ఈ సందడి సాగేది. ఇది పూర్తిగా ప్రకృతి పండగ. పాడిపంటల పండగ. వరిదుబ్బును గద్దెపై పెట్టి.. పసుపు కుంకుమలతో అలంకరించి.. నిత్యం దీపారాధన చేస్తూ ... రాత్రుళ్ల అక్కడ ఆటపాటలతో గడిపేవారు. ఈ సంబరానికి సంబంధించిన మౌఖిక సాహిత్యం ఎంతో ఉంది. రకరకాల లయాత్మకంగా వరుసల్లో నృత్యం చేస్తూ .. పాడుకునే పాటలు చాలావి ఉన్నాయి. మహిళలు పాడుతూ ఆడుతూ ఉంటే– పురుషులు వాద్య సహకారం అందించేవారు. ఇతరత్రా ఉత్సవ సందళ్లలో పాల్గొనేవారు.

ఎంత చక్కని తల్లివే గైరమ్మ
ఎంత చక్కని తల్లివే ఓ గైరమ్మ
ఒక్కొక్క పోకందునా గైరమ్మ
ఒక్కొక్క ఆకుందునా గైరమ్మ
కస్తూరి చలమందునా గైరమ్మ ... ఇలా గైరమ్మ పాట సాగుతుంది.

ఈ గైరమ్మను కొలిచే, పాడే, వేడుకునే తీరు తెలంగాణాలో జరిగే బతుకమ్మ పండగను తలపిస్తుంది. ఆఖరిరోజున గైరమ్మను కూడా నీళ్లలో ఓలలాడిస్తారు. అయితే, ఇదిప్పుడు శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో కొన్ని గ్రామాల్లో మాత్రమే కనిపిస్తుంది. విజయదశమి తరువాత ఈ సందడి మొదలవుతుంది. శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతంలో పాడుకునే ఈ పాటలో ప్రకృతి ఆరాధనను స్పష్టంగా వినవచ్చు.

ఎంత చక్కని తల్లివే ఓ గైరమ్మ
ఎంత చల్లని తల్లివే ఓ గైరమ్మ
జాదవలు పోసేమమ్మా ఓ గైరమ్మ
చిన్నచిన్న మేఘాలలో ఓ గైరమ్మ
చిన్నమ్మ దిగిరావమ్మా ఓ గైరమ్మ
పెద్దపెద్ద మేఘాలలో ఓ గైరమ్మ
పెద్దమ్మ దిగిరావమ్మా ఓ గైరమ్మ
మొక్కుకున్న మొక్కులన్ని ఓ గైరమ్మ
నీకే చెల్లించామమ్మా ఓ గైరమ్మ
మా పాడిపంటలను ఓ గైరమ్మ
కలకాలం కాపాడాలమ్మా ఓ గైరమ్మ
మా పిల్లాపాపలను ఓ గైరమ్మ
సల్లంగా చూడాలమ్మా ఓ గైరమ్మ

విజయనగరం జిల్లా సాలూరు, పార్వతీపురం, బొబ్బిలి, శృంగవరపుకోట, భోగాపురం; విశాఖ జిల్లా నర్సీపట్నం, అనకాపల్లి, ఎలమంచిలి తదితర ప్రాంతాల్లో ఈ ఉత్సవాలు జరుగుతాయి. 21 రోజుల ఆరాధన, ఆటపాటల సందడి పూర్తయ్యాక– ఆఖరి రోజున అనుపోత్సవం (నిమజ్జనం) నిర్వహిస్తారు. ఘనంగా మేళతాళాలతో, వివిధ నృత్యాలతో, బండ్ల వేషాలతో గైరమ్మను తోడ్కొని వెళ్లి... చెరువులు తదితర జలాశయాల్లో నిమజ్జనం చేస్తారు. అయితే, ప్రాంతానికి, ప్రాంతానికి మధ్య ఈ సంబరాల్లో, ఆరాధనా పద్ధతుల్లో కొద్దిపాటి తేడాలు ఉంటాయి. ఉత్తరాంధ్ర నుంచి వలస వెళ్లి అండమాన్ నికోబార్ దీవుల్లో స్థిరపడ్డ వారు ఇప్పటికీ ఈ గైరమ్మ సంబరాలు జరుపుకుంటారు. వ్యవసాయంతో ముడి తెగిపోయినప్పటికీ – వారు అక్కడ మూల సంప్రదాయాన్ని ఏటేటా సంబరాల రూపంలో గుర్తు చేసుకుంటారు.

పాటల్లోనే కథలూ గాథలూ ...

గైరమ్మ సంబరాల్లో పాడుకునే అనేక పాటల్లో రామాయణ, భారత గాథల ఇతివృత్తాలు కూడా ఉంటాయి. గంగా పార్వతి సంవాదం, పార్వతీ సందీశ్వరుడి సంవాదం కూడా పాటల్లో వినిపిస్తారు. 'రావనా చందనాలో' వరుసతో వచ్చే పాడే చాలా హుషారుగా సాగుతుంది. ఈ పాట బాణీని గతంలో ఎన్నికల ప్రచారంలోనూ విరివిగా వాడేవారు. గైరమ్మ కథను ఉయ్యాలో వరసలో పాడే పాట కూడా ఉంది.

ఏడుగురు తోడనా ఉయ్యాలో
ఒక్కదాయి రింజమ్మ ఉయ్యాలో
చెల్లెలా రింజమ్మ ఉయ్యాలో ... బాణీలో ఇది నడుస్తుంది.

గైరమ్మ ఆరాధనలో గోగిపూలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అది ఈ పాటలో చూడండి.

ఒక్కపువ్వా పూచే గోగిపువ్వో
పళ్లెరాన పోసి గోగిపువ్వ
పళ్లెరాన పోసె గోగిపువ్వో
ఏడత్తా నీ కొడుకు గోగిపువ్వ
పొద్దోయి వేళాయె గోగిపువ్వ
శివుడెళ్లి చిత్తాడ గోగిపువ్వ
గంగ మరిగిన జాన గోగిపువ్వ..

దీనిలో పార్వతి ఆవేదన, అంతరంగమూ ఆవిష్కృతం అవుతాయి. పాటకు పాట, కథకు కథ .. ఇలా సాగిపోతాయి.

పువ్వుల్లో .. కాయల్లో ...

పంటల ప్రాధాన్యాన్ని వివరించే మరోపాట చిక్కుడు పువ్వుల పాట. ప్రతి పంటలో, పూవులో గైరమ్మను చూడటం జానపదుల ఆనవాయితీ.

చిక్కుడు పువ్వుందమోలీ గైరమ్మా
చిక్కుడ కాయందమా గైరమ్మా
చిలకల పలుకులు సాయప్ప దండాలు
చందమామా నీళ్ల
నీకుడ్డ విరబోసే నా గైరమ్మా నీ నోము
నోచుతివి గైరమ్మా
అరటిపువ్వుందమోలీ గైరమ్మా
అరటిపువ్వుందమా గైరమ్మా ... ఇలా అనేక పువ్వులతో, కాయలతో గైరమ్మను పోలుస్తారు.

ఈ పండగలో భాగంగా నందెన్న (శివుడు)కు వివిధ ఫలాలను నివేదించే పాట ఉంది.

ఈవొచ్చె ఆవొచ్చె
ఎలగాపళ్ల కావుకొచ్చె
నీవందిపుచ్చుకోరా నందెన్న
నీ గాలి మేడలుకే
ఈవొచ్చె ఆవొచ్చె
దబ్బాపళ్లు కావుకొచ్చె
నీవందిపుచ్చుకోరా నందెన్న .. ఇలా నడుస్తుంది.

గైరమ్మ కథను మహిళలు తుమ్మీద వరుసలో పాడతారు.

నోమి నోమన్నల్ల తుమ్మీద
నోమన్నలా రేమి తుమ్మీద
దచ్చి దచ్చిణాది తుమ్మీద
దచ్చుడు భార్య తుమ్మీద
లచ్చుమ్మ శివదేవి తుమ్మీద
లచ్చుమ్మ కన్నాది తుమ్మీద
నూటొక్క కూతుళ్లను తుమ్మీద ...

ఇదొక పెద్ద కథ. తల్లికూతుళ్ల సంవాదం కూడా దీనిలోనే సాగుతుంది.

ఒక్కొక్క పువ్వేసి చందమామా
ఒక్క జాము అయ్యే చందమామా
శివపూజ యాళాయె చందమామా
శివుని జాడ లేదే చందమామా

.. ఇది శివుడి కోసం గైరమ్మ ఎదురుచూసే పాట. చాలా హృద్యంగా సాగుతుంది.

ఇలా ఇంకా ఎన్నో ఉన్నాయి. చాలావి పాడేవాళ్లు లేక, పాడేవారి నుంచి వేరెవరూ నేర్చుకోక కాలగర్భంలో కలిసిపోయాయి. కొన్ని పుస్తకాలకు పరిమితమై ఉన్నాయి. రకరకాల పువ్వులు, పంటల్లో పోల్చుకొని.. పొదువుకొని ఉత్తరాంధ్ర జానపద హృదయంలో ఎన్నెన్నో పాటలు, వాటికి అనుగుణంగా ఆటలూ రంజిల్లాయి. ఇప్పుడు అలాంటి జానపద వైభవం లేదు. అక్కడక్కడ వెతికిచూస్తే– కొద్దికొద్ది ఆనవాళ్లు తప్ప– ఇప్పుడు ఎక్కువగా కనిపించవు. కొత్తగా వచ్చిన మార్పుల్లోకి తీరప్రాంతం చాలా వేగంగా మారిపోతూ వచ్చింది. దాని ఫలితమే ఇది. ఇక్కడి తరతరాల ఆటపాటల సంస్కృతి నానాటికీ తగ్గిపోయి.. కొత్తకొత్తవి చివుళ్లెత్తాయి. నిజానికి జానపదం మన జీవనాడి. మన మూలనిధి. ఉన్నంతలో దానిని కాపాడుకోవటం, రాష్ట్రం నలుచెరుగులా విస్తరించుకోవటం ఒక అవసరం. అలా చేస్తే– అరువు తెచ్చుకున్న ఆధునిక డ్యాన్స్ బేబీ డ్యాన్సు స్థానే మనవే అయిన గొంతులు మార్మోగుతాయి. మన గ్రామాల గుండెలు ఉప్పొంగుతాయి.

– సత్యాజీ

దర్శకుల దర్శకుడు ఎఆర్ కృష్ణ

కళల కాణాచి తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్ విజయవాడ వారి సంయుక్త నిర్వహణలో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మూడవ పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల పోటీలు 2023' ఈనెల 20 నుంచి 24 వరకూ జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుర్రా సుబ్రమణ్య శాస్త్రి, ఏఆర్ కృష్ణ రంగస్థలం పురస్కార ప్రదానం కూడా జరుగుతుంది. 20వ తేదీ సాయంత్రం వీణా అవార్డుల ప్రారంభోత్సవ సభలో ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థలం పురస్కార ప్రదానం; ఈసారి ప్రదర్శిస్తున్న నాటికల సంపుటి విపంచి 2023 ఆవిష్కరణ కూడా జరిగాయి. వక్తలు ఏఆర్ కృష్ణ గారి నాటక రంగ సేవలు గుర్తు చేసుకుని నివాళులర్పించారు. పురస్కార గ్రహీత నెమలికంటి తారక రామారావు తనకు కృష్ణ గారితో గల జ్ఞాపకాలను పంచుకున్నారు. కృష్ణ గారి పెద్ద కుమారుడు ఏపీ నీలం కూడా పాల్గొని తన తండ్రి గారి నాటక రంగ నిబద్ధత గురించి మాట్లాడారు. నాటక రంగ ప్రయోజనాలు, శ్రేయస్సు కోసం ఎంతటి స్థాయిలో ఉన్న వారితోనైనా తన అభిప్రాయాన్ని నిర్భయంగా, నిర్మొహమాటంగా మాట్లాడేవారని, తన వద్ద శిక్షణ పొందిన యువ పేద కళాకారులను తర్ఫీదు సమయాన కోపంతో దండించినా, వారి భుక్తి విషయమై శ్రద్ధ పెట్టే వారిని గుర్తు చేసుకున్నారు.

ఏఆర్ కృష్ణ గారి పూర్తి పేరు అడుసుమల్లి రాధాకృష్ణ శాస్త్రి. తెనాలి దగ్గర పెరవలి గ్రామంలో 13 నవంబర్ 1926న జన్మించారు. ఏపీ విద్యుత్ శాఖలో పనిచేసి రిటైర్ అయ్యారు. 1952లో గాలి చేపలు ఉత్తమ కథా రచయితగా, దేశం కోసం ఉత్తమ నాటక రచయితగా బహుమతులు పొందారు. ఇండియన్ నేషనల్ థియేటర్, ఏపీ నాట్య సంఘం, భారతీయ నాట్య సంఘం వంటి సంస్థలకు సారథ్యం వహించారు. 1956 నుంచి నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సందర్భంగా కార్యక్రమాలను నిర్వహించేవారు. 1962 నుంచి 1972 వరకు నాట్య శిక్షణ విద్యాలయం నిర్వహించారు. ఆంధ్రా, ఉస్మానియా, బరోడా విశ్వవిద్యాలయాలకు ఎగ్జామినర్ గాను, బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్ గాను పనిచేశారు.

1960లో థియేటర్ ఆర్ట్స్ చదవడానికి బ్రిటిష్ డ్రామా లీగ్, లండన్‌కు వెళ్లారు. 1962–63 సంవత్సరానికి యూఎస్‌ఏ యంగ్ థియేటర్ డైరెక్టర్‌గా ఫోర్డ్ ఫౌండేషన్ వారి స్కాలర్‌షిప్‌పై ఆరు నెలలు పని చేసి వచ్చారు. అక్కడ అన్ని రాష్ట్రాల్లో ఉన్న థియేటర్లను సందర్శించారు. ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికై, ప్రతి సంవత్సరం పారిస్‌లో జరిగే సమావేశాలకు వెళ్లి వచ్చేవారు. తోలు బొమ్మలాట బృందాలను ఫ్రాన్స్, ఇతర దేశాలకు తీసుకువెళ్లేవారు. థియేటర్ కాన్ఫరెన్స్‌ల కోసం 20 సార్లకు పైబడి విదేశీ పర్యటన చేశారు.

నటుడిగా– వీలునామా నాటకంలో ధర్మారావుగా, కన్యాశుల్కంలో రామప్ప పంతులుగా, మృచ్ఛకటికంలో చారుదత్తుడిగా, ప్రతాపరుద్రీయంలో ప్రతాపరుద్రుడు, చాకలి పేరిగాడుగా నటించారు. రచయితగా– నిచ్చెనలు, అరగంటలో అదృష్టం, దేశం కోసం, దాగని సత్యం, ఆదర్శమూర్తి, అబ్బాయా.. నీ ఖరీదు ఎంత? వీధి, వీర భోజ వసుంధర మొదలైన రచనలు చేశారు. మహా మంత్రి మాదన్న, సంరక్షకుడు అనువాద నాటకాలు రచించి నటించారు. మృణాల్ సేన్ ఒక ఊరి కథ, శ్యామ్ బెనగల్ అనుగ్రహం సినిమాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. దర్శకుడు, ప్రయోక్తగా రావిశాస్త్రి గారి నిజం, అధికారి, వీలునామా, ఇంకా జీవీ కృష్ణారావు గారి కీలుబొమ్మలు సంరక్షకుడు, పెద్ద మనుషులు ఆదర్శమూర్తి మొదలైన నాటకాలను ప్రదర్శించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి మాలపల్లిని జీవనాటకంగా తయారు చేశారు. హైదరాబాద్‌లో 12 వేదికలపై, కనీసం నూరు ప్రదేశాల్లో అలాంటి ప్రదర్శనలు కావించారు. నాట్య బృందం గోరా శాస్త్రి గారి ఆశ ఖరీదు అణా, మా నాన్న కావాలి, శాకుంతలం మొదలైన ప్రదర్శనలు ఇవ్వగా, కృష్ణ రాయబారం, సతీదాన శూరం యక్షగాన వీధిగా నాటకాల పద్ధతిలో ప్రదర్శించారు.

1969 నవంబరు ఒకటో తేదీన నాటక కళాకారుల ఊరేగింపులో అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి గారితో కలిసి నాటక ప్రదర్శనకు నడిపించుకుని తీసుకువచ్చారు. నాటక ప్రదర్శనలకు వినోద పన్నును రద్దు చేయించారు. 1970లో రంగస్థలం– ఒకటి, రెండు భాగాలు పాఠ్య పుస్తకంగా తెలుగు అకాడమీ ప్రచురించింది. ఆయన రచన, సంపాదకత్వంలో ఇది జరిగింది. 1980 జూలై 6న శ్రీ కళానికేతన్ హైదరాబాదు వారు బంగారు పతకం, నగదుతో సత్కరించారు. 1981 ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ సలహాదారుగా, ఆంధ్రప్రదేశ్ థియేటర్ అండ్ రిపర్టరీకి కులపతి గాను పనిచేశారు. 1992లో పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. 1992 నవంబరు 10న ఏఆర్ కృష్ణ తుదిశ్వాస విడిచారు. 1993లో ఏఆర్ క్రిష్ణ మెమోరియల్ ట్రస్టు ఏర్పాటైంది. దర్శకులకు దర్శకుడు ఏఆర్ కృష్ణ. డెడికేషన్, డిటర్మినేషన్, డిసిప్లిన్ అనే ఈ మూడు ముఖాలుగా, ప్రమాణాలతో ఆయన కృషి చేశారు.

ఈ సంవత్సరం ఏఆర్ కృష్ణ రంగస్థల అవార్డు గ్రహీత నెమలికంటి తారక రామారావు... అమరావతి మండలంలోని నెమలికల్లులో ఆగస్టు 7, 1939లో పుట్టారు. ఎం.ఎ; బిఇడి చదివారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుండి పీజీ డిప్లమో ఇన్ యాక్టింగ్‌లో, ఎన్సీఈఆర్టీ న్యూఢిల్లీ వారి ఎడ్యుకేషనల్ టెక్నాలజీలో శిక్షణ పొందారు. డైరెక్టరేట్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్లో సహాయ సంచాలకుడిగా ఉద్యోగ విరమణ చేశారు. వందకు పైగా కథలు రాశారు. చివరకు మిగలనిది, అర్ధానుస్వారం పేరిట కథా సంపుటాలు వెలువరించారు. ఆంతర్యాలు– అనుబంధాలు, కన్నె మనసులు అనే నవలలు ప్రచురించారు. బకాసుర, జనమేజయం, క్షమాయ ధరిత్రి వంటి పలు ప్రయోగాత్మక నాటకాలు రాసి ప్రదర్శించారు. ఆయన రాసిన వరుడు కావాలి నాటిక ఆ రోజుల్లో చాలా కళాశాలల్లో ప్రదర్శితమై, ఒక ట్రెండీ ప్లేగా పేరొందింది. శరణం గచ్ఛామి నాటకం అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా ప్రదర్శితమైంది. శ్రీ కళానికేతన్ సంస్థను స్థాపించి ఆ సంస్థ తరఫున నాటక నాటికలను ప్రదర్శిస్తున్నారు.

– మల్లేశ్వర రావు ఆకుల, 79818 72655

శ్మశాన జీవితాల చైతన్య స్వరం



సమాజంలోని అట్టడుగు వర్గాల సంస్కృతుల్ని లోతుగా అధ్యయనం చేస్తూ, ఆ సంస్కృతిని తన రచనల్లో ప్రతిఫలింపజేస్తూ, ఆ వర్గాల జీవితాల్లోని విభిన్న పార్శ్వాల్ని దృశ్యమానం చేస్తున్న రచయితల్లో డాక్టర్ వీఆర్ రాసాని ఒకరు. తెలుగులో తొంబయ్యవ దశకం తరువాత వేగం పుజుకున్న ఈ తరహా సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో ఈయన ముందున్నారు. ఈయన కలం నుంచి పురుషాహంకార కొలిమిలో మండిపోతూ బసివినుల అంతరాత్మలు వినిపించే ఘోష 'ముద్ర' నవలగాను, వీధినాటక కళాకారుల జీవన చిత్రాలు 'బతుకాట' నవలగాను; కట్టుబాట్లు, మూఢ నమ్మకాల మాటున దుర్భర జీవితాలననుభవించే స్త్రీల వేదనలు 'మట్టి బతుకులు' నవలగానూ వెలువడ్డాయి. ఇప్పుడు అట్టడుగు వర్గమైన కాటికాపరి జీవన సంఘర్షణ అనే ఒక సరికొత్త కాన్సెప్ట్ 'వొలికల బీడు' నవలగా రూపుదిద్దుకుంది.

మనిషి జీవితానికి ముగింపు పలికే వల్లకాడుల్లోనే అనుదినం బతుకుల్ని సాగిస్తూ సంఘర్షణకు గురయ్యే కాటికాపరుల జీవన విధానాల్లోని అనేక అంశాల్ని ఈ నవల స్పృశించింది. చిత్తూరు జిల్లాలోని ఒక కాటికాపరి కుటుంబం నిత్య వ్యవహారశైలిని సహజత్వం కోసం పూర్తిగా ఆ జిల్లా మాండలిక భాషలోనే రచయిత నవలీకరించారు. మృతదేహాల దహన సంస్కారాల మీద ఆధారపడుతూ జీవనం సాగించే దాసు, గంగి దంపతుల కుటుంబం శ్మశానంలో తంతులు సాగిస్తూ జీవిస్తుంటుంది. అయితే తంతులు రోజూ వుండకపోవడంతో వారు తాము నేర్చుకున్న కనికట్టు విద్యతో ప్రజలను ఆకట్టుకుంటూ జీవనం సాగిస్తూ వుంటారు.

కుల వివక్షలో భాగంగా అప్పుడప్పుడూ పాకీపనివాళ్ళు చేసే మలశుభ్రత పనులు కూడా వారు చేస్తుంటా రు. బొందయ్య, కాశయ్య దాసు సొంత కొడుకులైతే, చనిపోయిం దనుకొని శ్మశానానికి తీసుకొచ్చిన పసిబిడ్డగా తమకు దొరికిన సిన్నమ్మికి ఆ కుటుంబం ఆశ్రయమిస్తుంది. ఉలిగమ్మ దురాచార సంకెళ్లలో చిక్కుకొని, ఆ సంకెళ్లను తెంచుకొని పారిపోయి వచ్చిన భైరప్పనూ ఆ కుటుంబం తమ సభ్యునిగా ఆదరిస్తుంది. భైరప్ప వారిలో ఒకడై వారితోపాటు శ్మశాన తంతుల్లో చురుకుగా పాల్గొంటుంటాడు. ఈ క్రమంలో పట్టణాలు మున్సిపాలిటీలుగా మారిపోయి శ్మశానాలు కొత్త కట్టడాలను సంతరించు కుంటాయి. అయితే శ్మశానాలకు ప్రైవేటు కాంట్రాక్టర్ల వ్యవస్థ తోడవడంతో కాటికాపర్ల జీవితాలు దుర్భరంగా మారిపోతాయి. వారి ఉపాధికి గండి పడుతుంది. ఈ తతంగాన్నంతా గమనిస్తూ తన ఆలోచనలతో చైతన్యాన్ని నింపుకొనే భైరప్పలో తిరుగుబాటు తత్వం చోటుచేసుకుంటుంది. కాటికాపర్లందరినీ ఒక్కటి చేసి కాంట్రాక్టులతో శ్మశానాల్ని ప్రైవేటుపరం చేయడం తగదని, కుల వివక్షతో హరిశ్చంద్ర పేరు పెట్టిన శ్మశానాలకు వీరబాహు శ్మశానాలుగా పేర్లు మార్చాలని మేయర్‌కు వినతిపత్రం సమర్పిస్తాడు. బ్యానర్లు కట్టి దీక్షలో పాల్గొంటాడు. నినాదాలతో అతని ఉద్యమం ఊపందుకుంటుంది. ఈ నవలలో రచయిత ఒకవైపు దాసు కుటుంబం స్థితిగతుల్ని వివరిస్తూనే– మరోవైపు మగపిల్లల్ని ఉలిగమ్మలుగా మార్చే దురాచారం, బళ్లారి జిల్లా హొస్పేటలో ప్రతి ఏటా జరిగే హిజ్రాల పండుగ, చిత్తూరు జిల్లా గంగజాతరలో మోడీ ఆడించే సంప్రదాయం వంటి సంస్కృతుల్ని మనకళ్ల ముందు నిలపడం ఈ కాన్సెప్ట్ వెనుక వున్న పరిశోధనాత్మక దృక్పథాన్ని తెలియజేస్తుంది. ఆదాయం కోసమే శ్మశానాల రూపురేఖల్ని మార్చేసి కాటికాపరుల కడుపుకొట్టే కార్పొరేషన్ల తీరుతెన్నుల్ని రచయిత దుయ్యబడతారు. భైరప్ప ఆలోచనా ధోరణి ఈ నవలకు ఆయువుపట్టు. అతని ఆలోచనా ధోరణికి తగినట్టుగానే సావు నాటకంగా హరిశ్చంద్ర నాటక ప్రదర్శనను ప్రవేశపెట్టడం ఈ నవలా ప్రయోజనాన్ని శక్తివంతం చేసింది. హరిశ్చంద్ర నాటక ప్రదర్శనను తిలకించిన భైరప్ప ఆలోచనా ధోరణి ఇలా సాగుతుంది...: 'ఎంత ఉన్నోడైనా, లేనోడైనా, ఎంత గొప్పోడైనా సరే అందర్నీ ఒకే మాదిరిగా కాట్లో యేసి కాల్చేది వోడే గదా. అంత మంచిగుణం వుండేవోడు కాబట్టే వీరబాహుడు ఆ మారాజును ఆదరించినాడు. ఆయనే లేకుంటే హరిశ్చంద్రుడుడు సచ్చేవోడే. కాబట్టి శ్మశానాలకు అసుకుళ్లు, తర్పణాలు వొదిలే చోట్లకు హరిశ్చంద్ర శ్మశానమని, హరిచ్చంద్ర ఘాటు అని పెర్లు పెట్టడం శానా దుర్మార్గం. అట్ల పేర్లు పెట్టడంలోనే పెద్ద కులాలోళ్ల కుట్ర తెలిసిపోతావుండాది'...

హరిశ్చంద్ర నాటకం భైరప్పను తీవ్రంగా ఆలోచింపజేసి అతనిలో చైతన్యాన్ని అంకురింపజేస్తుంది. మనుషుల జీవితాలు శ్మశానాల్లో ముగిసిపోయే సమయాల్లో తోటి మనుషుల్లో పొడసూపే చిత్రవిచిత్ర ప్రవృత్తులు భైరప్పతో బాటు పాఠకుడిలోనూ పలు ప్రశ్నలను రేకెత్తిస్తాయి. శవాల తంతు మానవ సంబంధాల తీరుతెన్నులనూ బట్టబయలు చేయడం ఈ నవలలో కనిపిస్తుంది. బడుగు వర్గాల్లోనూ కనిపించే కుల వివక్షను రచయిత ఎత్తిచూపడాన్ని గమనించవచ్చు.

మానవత్వం మూర్తీభవించే మనిషి శ్మశానంలో దేహాన్ని విడిచినా అతడి మనిషితనం పదిమంది హృదయాల్లో పదిలంగా చోటుచేసుకుంటుందని, స్వార్థం పెనుగాలిలో కొట్టుకుపోయే మనుషులు శ్మశానంలో దేహంతోపాటు మనిషితనాన్నీ పోగొట్టుకుంటారన్న సత్యాన్ని విడమరచి చెబుతుందీ నవల. తెలుగు నవలాసాహిత్యంలో తొలిసారిగా కాటికాపరి మౌనవేదనకు, లక్ష్యశోధనకు ప్రతిరూపంగా కనిపిస్తుంది 'వొలికల బీడు'. రూ.150 ధర ఉన్న ఈ నవల ప్రతి కోసం **98484 43610** నెంబర్లో రచయితను సంప్రదించొచ్చు.

– డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
91777 32414

గర్భా నృత్యాల్లో 10 మంది మృతి

- గుజరాత్ నవరాత్రి వేడుకల్లో విషాదం

అహ్మదాబాద్ : గుజరాత్‌లో నవరాత్రి వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. గర్భా నృత్యాలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గత 24 గంటల్లో పదిమంది గుండెపోటుతో మరణించారు. బరోడాలోని దభోయ్‌కు చెందిన 13 ఏళ్ల బాలుడు, కపద్వంజ్‌లో 17 ఏళ్ల యువకుడు కూడా ప్రాణాలు కోల్పోయిన వారిలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచి గుండె సంబంధిత సమస్యలతో 108 ఎమర్జెన్సీ అంబులెన్స్ సర్వీసులకు 521 కాల్స్ రాగా, శ్వాస సంబంధిత సమస్యలతో 609 కాల్స్ వచ్చాయి. ఈ కాల్స్ అన్నీ గర్బా వేడుకలు జరిగే సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 2 గంటల మధ్యే రావడం గమనార్హం. గర్బా వేదికలకు సమీపంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

వేర్వేరు జైళ్లకు ఆజంఖాన్ కుటుంబ సభ్యుల తరలింపు

లక్నో : బర్త్ సర్టిఫికెట్లకు సంబంధించిన కేసులో ఆజం ఖాన్, ఆయన భార్య తజిన్ ఫాత్మా, తనయుడు అబ్దుల్లాకు ఎంపిఎల్ఎ కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. పోలీసులు వారు ముగ్గురినీ అదుపులోకి తీసుకొని రాంపూర్ జైలుకు తరలించారు. శనివారం రాత్రి ఆజం, అబ్దుల్లాను రాంపూర్ జైలు నుంచి తరలించాలని పోలీసులకు ఆదేశాలు వచ్చాయని, ఈ మేరకు ఆజం ఖాన్‌ను సీతాపూర్, అబ్దుల్లా ఆజమ్‌ను హర్దోయ్ జైలుకు తరలించినట్లు ఎస్‌పి రాజేశ్ ద్వివేది తెలిపారు. ఆజం భార్య తజిన్ ఫాత్మాను రాంపూర్‌లోనే ఉంచినట్లు పేర్కొన్నారు. ఆజంఖాన్, అబ్దుల్లా ఆజమ్‌లను ఆదివారం ఉదయం 5గంటలకు పరీక్షల పేరుతో రాంపూర్ జైలు నుంచి జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పోలీసు వాహనంలో కూర్చునేందుకు ఆజంఖాన్ నిరాకరించారు. దీంతో పోలీసులు ఆయనకు నచ్చజెప్పారు. తనకు ప్రాణహాని ఉందని గతంలో ఆజంఖాన్ చెప్పడం గమనార్హం.

అధిక సంఖ్యలో మెయితీ పోలీస్‌లతో మోహరింపు

- మణిపూర్ గిరిజనుల నిరసన

ఇంఫాల్ : మణిపూర్-మయన్మార్ సరిహద్దులో ఉన్న మోరే పట్టణం వద్ద అధిక సంఖ్యలో మెయితీ పోలీసులను మోహరించడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన మహిళలు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. మోరేకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చికిమ్ గ్రామం వద్ద మహిళల నిరసనలు కొనసాగుతున్నాయి. కుకీలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో మెయితీ పోలీసులను అధిక సంఖ్యలో మోహరించడంపై ఆందోళనలు వ్యక్తవుతున్నాయి. మరింత సంఖ్యలో ఇక్కడ పోలీసులు మోహరింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది శాంతికి భంగం కలిగిస్తుందని కుకీ ఇన్పి-గిరిజన ఐక్యత కమిటీ (సిఒటియు) ఒక ప్రకటనలో తెలిపింది. ఇక్కడ ఇప్పటికే పారా-మిలటరీ, భారత సైన్యం బఫర్ జోన్లు నిర్వహిస్తూ శాంతిని పరిరక్షిస్తున్నాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వం మెయితీ పోలీసులను అధిక సంఖ్యలో మోహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని ప్రకటనలో తెలిపింది. ఇంఫాల్-మోరే రహదారి వెంబడి మెయితీలు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను తొలగించాలని సిఒటియు డిమాండ్ చేసింది. డబుల్ ఇంజన్ సర్కార వైఫల్యంతో మెయితీలు, కుకీల మధ్య జరిగిన హింసాకాండలో 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

విహార యాత్రలో విషాదం

- పేరుపాలెం బీచ్‌లో ఇద్దరు మృతి, మరొకరు గల్లంతు

ప్రజాశక్తి - మొగల్తూరు (పశ్చిమ గోదావరి జిల్లా)

విహార యాత్రకు పేరుపాలెం బీచ్‌కు వచ్చిన ఇద్దరు నీట మునిగి మృత్యువాత పడిన ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని బొమ్మలవీధికి చెందిన సుమారు 15 మంది రెండు ఆటోల్లో ఆదివారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. మధ్యాహ్న సమయంలో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతికి వీరిలో ఐదుగురు నీట మునిగారు. దీన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమై వారిలో నలుగురిని ఒడ్డుకు తీసుకొచ్చారు. ఒకరు గల్లంతయ్యారు. గొరసా సావిత్రి (35), అనుపోజు రఘువర్మ (25), అనుపోజు శ్రావణి, గోరస తన్మయిలను ఒడ్డుకు చేర్చగా అప్పటికే సావిత్రి ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన ముగ్గురిని హుటాహుటిన అంబులెన్స్‌లో నరసాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రఘువర్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రావణి, తన్మయిల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వీరితోపాటు నీట మునిగిన అనుపోజు వసంతకుమార్ (17) గల్లంతయ్యాడు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు బీచ్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. సిఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్ఐ ఎం వీరబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సావిత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బిజెపిలో టికెట్ల లొల్లి

- రాజస్థాన్‌లో కార్యాలయాల ధ్వంసం, దిష్టిబొమ్మల దహనం
- మధ్యప్రదేశ్‌లోను ఆందోళనలు

రాజస్థాన్‌లో బిజెపి కార్యకర్తల ఆందోళన

న్యూఢిల్లీ : టికెట్లు అమ్ముకున్నారని, అనర్హులకు ఇచ్చారని ఆరోపిస్తూ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో బిజెపి కార్యకర్తలు ఆందోళన చేస్తున్నారు. బయటి వ్యక్తులను వెనక్కి పంపాలని డిమాండ్ చేస్తున్నారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల రెండో జాబితా విడుదలైన తర్వాత ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. బిజెపి శనివారం విడుదల చేసిన రెండో జాబితాలో 83 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇప్పటివరకు ప్రకటించిన మొత్తం అభ్యర్థుల సంఖ్య 124కి చేరుకుంది. పార్టీ కార్యకర్తలు చిత్తోర్‌గఢ్, రాజ్‌సమంద్, బుండి, అల్వార్, ఉదయపూర్, జైపూర్‌లలో నిరసనలు చేపట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిపి. జోషికి పార్టీ జిల్లా విభాగాలకు చెందిన పలువురు పదాధికారులు తమ రాజీనామాలను సమర్పించారు. చిత్తోర్‌గఢ్ ఎమ్మెల్యే చంద్రభన్ సింగ్ ఆక్య తనకు సీటు నిరాకరించడానికి జోషినే బాధ్యుడని, ఈ నిర్ణయం వల్ల పార్టీ నష్టపోతుందని అన్నారు. ఆక్య మద్దతుదారులు జోషి దిష్టిబొమ్మను దహనం చేశారు. మధుబన్ కాలనీలోని జోషి నివాసం ప్రవేశ ద్వారంపై కొందరు యువకులు రాళ్లు రువ్వడంతో భద్రతను పటిష్టం చేశారు.

రాజ్‌సమంద్‌లోని బిజెపి కార్యాలయాన్ని ఆ పార్టీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. పార్టీ కార్యాలయం ముందు రోడ్డుపై ఎన్నికల సామగ్రిని ధ్వంసం చేయడం, ఫర్నీచర్ ధ్వంసం చేయడం, టైర్లను తగులబెట్టడం వంటివి చేయడంతో పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు.

అశోక్ డోగ్రాకు వ్యతిరేకంగా బుండీలో, సంజయ్ శర్మకు వ్యతిరేకంగా అల్వార్‌లో నిరసనలు జరిగాయి. వీరిద్దరూ 2018లో గెలిచి మళ్లీ రంగంలోకి దిగారు. జైపూర్ సమీపంలోని సంగనేర్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్ లాహోటి మద్దతుదారులు భజన్‌లాల్ శర్మకు టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యాలయం వెలుపల నినాదాలు చేశారు.

మధ్యప్రదేశ్‌లో టికెట్ల కేటాయింపుపై బిజెపి కార్యకర్తల నిరసన

బిజెపి అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో అభ్యర్థులకు టికెట్ల కేటాయింపుపై ఆ పార్టీ కార్యకర్తలు నిరసనకు దిగారు. తమ అభ్యర్థులకు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవంబర్ 17న జరగనున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 92 మంది అభ్యర్థులతో కూడిన ఐదో జాబితాను బిజెపి శనివారం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో టికెట్ ఆశించిన అభ్యర్థుల మద్దతుదారులు, బిజెపి కార్యకర్తలు పలుచోట్ల నిరసనకు దిగారు. ఆ పార్టీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్‌లో రెండు స్థానాలు మినహా మిగిలిన అన్ని స్థానాల్లో పోటీ చేసే బిజెపి అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. అందరూ మంచి అభ్యర్థులే అని, చాలామంది టికెట్లు అడగడం వల్ల కొన్ని విభేదాలు ఉన్నాయని, పార్టీలో పరిస్థితి అదుపులోనే ఉందని అన్నారు.

అధికారులు, సైనికులు 'ప్రచారక్'లా?

- ఉత్తర్వులను ఉపసంహరించుకోండి : ప్రధాని మోడీకి ఖర్గే లేఖ

న్యూఢిల్లీ : గత తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రచారం చేసే బాధ్యతలను సీనియర్ అధికారులకు అప్పగిస్తూ ఇటీవల జారీచేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రధాని నరేంద్రమోడీకి ఖర్గే లేఖ రాశారు. ఇలాంటి ఉత్తర్వులు అధికార యంత్రాంగాన్ని 'రాజకీయం' చేయడమే అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 18న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుపై ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. గత తొమ్మిదేళ్లలో కేంద్రం సాధించిన విజయాలను ప్రచారం చేయడానికి జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ సెక్రటరీ వంటి ఉన్నత స్థాయి అధికారులను దేశంలోని మొత్తం 765 జిల్లాలకు 'రథ్'గా నియమించాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 9న రక్షణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మరొక ఉత్తర్వును కూడా ఖర్గే తన లేఖలో ప్రస్తావించారు. వార్షిక సెలవుల్లో ఉన్న సైనికులు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి తమ సమయాన్ని వినియోగించాలని ఈ ఉత్తర్వుల్లో కోరారు. ఈ విధమైన ఉత్తర్వులు సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1964ను స్పష్టంగా ఉల్లంగించడమే అని ఖర్గే తెలిపారు. పైన పేర్కొన్న రూల్స్ ఏ ప్రభుత్వ ఉద్యోగి కూడా ఎటువంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని నిర్దేశిస్తున్నాయి. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులు ప్రభుత్వ అధికారుల్ని అధికార పార్టీ రాజకీయ కార్యకర్తలుగా మారుస్తాయని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రచారానికి ఉన్నతస్థాయి అధికారుల్ని వినియోగిస్తే రాబోయే ఆరు నెలల పాటు దేశ పాలన ఆగిపోతుందని తెలిపారు. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి పై ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవడం అత్యవసరమని ఖర్గే తన లేఖలో తెలిపారు. ప్రధానికి తాను రాసిన లేఖను ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు దేశంలోని రాజకీయ పార్టీలకు మాత్రమే కాకుండా ప్రజలకు కూడా ఆందోళన కలిగించే విషయంగా ఖర్గే తెలిపారు.

ప్రజాస్వామ్యంలో సాయుధ బలగాలను రాజకీయాలకు దూరంగా ఉంచడం అత్యంత కీలకమని ఖర్గే తెలిపారు. ప్రతి సైనికుడు తన దేశం, రాజ్యాంగం పట్ల విధేయతగా ఉంటారని, ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని సైనికులను బలవంతం చేయడం ప్రమాదకరమైన అడుగుగా ఖర్గే విమర్శించారు. 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పాటు, ఆదాయపు పన్ను శాఖ, సిబిఐ ఇప్పటికే బిజెపికి ఎన్నికల విభాగాలుగా పనిచేస్తున్నాయి. పైన పేర్కొన్న ఉత్తర్వులు మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని అధికార పార్టీకి ఏజెంట్లుగా పనిచేసేలా చేస్తున్నాయి' అని కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు.

బిజెపి ఎంపీలకు ఓ లెక్కా... మాకో లెక్కా.. : బిఎస్‌పి ఎంపీ అలీ

న్యూఢిల్లీ : బిజెపి ఎంపీల విషయంలో పార్లమెంటరీ ప్యానెల్స్ అనుసరిస్తున్న తీరును బిఎస్‌పి ఎంపీ దానీశ్ అలీ తప్పుబట్టారు. బిజెపి ఎంపీలు చేసే ఫిర్యాదులు లేదా వారిపై వచ్చే ఫిర్యాదుల విషయంలో ఇవి వివిధ ప్రమాణాలు పాటిస్తున్నాయని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రకు వ్యతిరేకంగా బిజెపి ఎంపీ నిశికాంత్ దూబే చేసిన ఫిర్యాదును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో దనీశ్ అలీ ఉటంకించారు. బిజెపి ఎంపీ రమేశ్ బిధురీ మతపరమైన, అసభ్య పదజాలంతో తనను దూషించటంపై ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదుతో పోలిస్తే నిశికాంత్ దూబే ఫిర్యాదును భిన్నంగా చూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్యానెల్ ముందుకు తొలుత నిందితుడిని పిలవడానికి ముందు ఫిర్యాదుదారుడిని పిలవాలని పై రెండు ఘటనల గురించి వివరిస్తూ తన అభిప్రాయాన్ని వివరించారు.

'ది వైర్' రిపోర్టులకు అవార్డులు

న్యూఢిల్లీ : 'ది వైర్' న్యూస్ పోర్టల్‌లో ప్రచురితమైన రెండు రిపోర్టులకు అవార్డులు దక్కాయి. సయాంతన్ దత్త రాసిన ఆర్టికల్, పవన్‌జోత్ కౌర్, సౌమాశ్రీ సర్కార్‌లకు చెందిన వీడియోలు 2023 సంవత్సరానికి గానూ లాడ్లి మీడియా అవార్డులను పొందాయి. దత్త రాసిన ఆర్టికల్ 'ఇండియన్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్స్ క్యూరియస్ పెంచాంట్ ఫర్ జెండర్డ్ హాస్టల్స్' ది వైర్ సైన్స్‌లో ప్రచురితమైంది. ఇది ఇంగ్లీష్ (ఫీచర్స్) విభాగంలో అవార్డును దక్కించుకున్నది. ఇక కౌర్, సర్కార్‌లకు చెందిన వీడియో రిపోర్టు.. దక్షిణ బెంగాల్‌కు చెందినది. ఇందులో రెండు గ్రామాలలో వాతావరణ పరిస్థితులు, అక్కడి మహిళలు చేసిన కృషి గురించి వివరించారు. ఇది కూడా ఇంగ్లీష్ (ఫీచర్) విభాగంలో అవార్డును సొంతం చేసుకున్నది.

నవజాత శిశువుల నరకయాతన

- గాజాకు ఇంధనం నిలిపివేసిన ఇజ్రాయిల్
- ప్రమాదకరంగా 120 మంది చిన్నారుల పరిస్థితి : ఐరాస ఆందోళన

జెరూసలేం : గాజాకు ఇజ్రాయిల్ ఇంధనం నిలిపివేయడంతో ఇన్‌క్యూబరేటర్లలో ఉన్న సుమారు 120 మంది నవజాత శిశువుల పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో వివిధ ఆసుపత్రుల్లో సుమారు 120 మంది నవజాత శిశువులు ఇన్‌క్యూబేటర్లలో ఉన్నారు, ఇంధన నిల్వలు చివరిదశకు రావడంతో వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఐరాసకు చెందిన యునిసెఫ్ ఆదివారం తెలిపింది. వీరందరినీ విద్యుత్‌తో నడిచే ఇన్‌క్యూబరేటర్లలో ఉంచామని, ఇజ్రాయిల్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తే వీరి ప్రాణాలు ప్రమాదంలో పడినట్లే అని యునిసెఫ్ ప్రతినిధి తెలిపారు.

ఇజ్రాయిల్ తరచూ విద్యుత్ కోతలు విధిస్తుండటంతో, గాజా ఆసుపత్రుల్లో జనరేటర్లకు ఇప్పటికే ఇంధనం అయిపోయిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ గురువారం ప్రకటించింది. జనరేటర్లు ఆగిపోతే డయాలసిస్ అవసరం ఉన్న సుమారు వెయ్యి మంది ప్రాణాలకు ప్రమాదమని డబ్ల్యూహెచ్‌ఒ తెలిపింది. శనివారం ఈజిప్ట్ నుంచి గాజాకు సహాయక సామగ్రితో 20 ట్రక్కులు వచ్చినా వీటిల్లో ఇంధనం లేదు. హమాస్‌కు ఇంధనం సహాయపడుతుందని ఆరోపిస్తూ గాజాలోకి ఇంధనం పంపించడానికి ఇజ్రాయిల్ అడ్డుపడుతోంది. పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం ఈ నెల 7న ఇజ్రాయిల్ దాడులు ప్రారంభమైన దగ్గర నుంచి ఇప్పటి వరకూ 1,750 మంది చిన్నారులు మరణించారు. గాజాలోని ఆసుపత్రులు మందులు, ఇంధనం, నీటి కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. ఇంధనం లేకపోవడంతో సుమారు 130 మంది నవజాత శిశులు చనిపోయే ప్రమాదం ఉందని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. ఐరాస పాపులేషన్ ఫండ్ ప్రకారం గాజాలో ప్రతి రోజూ 160 ప్రసవాలు జరుగుతున్నాయి. గాజాలో ప్రస్తుతం సుమారు 50 వేల మంది గర్భిణులు ఉన్నారని అంచనా. వీరిలో ఇప్పటికే కొన్ని వందల మంది ఇజ్రాయిల్ ప్రస్తుత దాడుల్లో మరణించారు.

ఇజ్రాయిల్ దాడుల్లో 4,651 మంది మృతి

ఇజ్రాయిల్ దాడుల కారణంగా గాజాలో ఇప్పటి వరకూ 4,651 మంది మరణించారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. వీరిలో 1,873 మంది చిన్నారులు ఉన్నారని తెలిపింది. మరో 14,245 మంది గాయపడినట్లు తెలిపింది. ఆదివారం తెల్లవారుజామున కూడా దక్షిణ గాజాపై వైమానిక దాడులతో ఇజ్రాయిల్ విరుచుకుపడింది.

గాజాపై యుద్ధం ఆపండి : పోప్ ఫ్రాన్సిస్

గాజాపై ఇజ్రాయిల్ తన యుద్ధాన్ని తక్షణమే ఆపాలని పోప్ ఫ్రాన్సిస్ ఆదివారం పిలుపునిచ్చారు. గాజాలోకి మరింత మానవీయ సహాయాన్ని అనుమతించాలని ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశారు. రోమ్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్ వద్ద ఆదివారం ప్రార్థనల తరువాత పోప్ ఈ పిలుపునిచ్చారు. 'యుద్ధంతో ఎల్లప్పుడూ ఓటమే ఎదురవుతుంది. యుద్ధం మానవ సోదరభావాన్ని నాశనం చేస్తుంది' అని పోప్ తెలిపారు. సరిహద్దులు తెరవాలని, మానవతా సహాయం అందించడం కొనసాగించాలని, బందీలను విడుదల చేయాలని మరోసారి కోరారు.

మరో 17 ట్రక్కుల సహాయం

87 టన్నుల ఆహారం, వైద్య పరికరాలతో రెండు విమానాలు ఖతార్ నుంచి ఈజిప్టు నగరమైన అల్-అరిష్‌కు చేరుకున్నాయని ఖతార్ విదేశాంగ మంత్రి తెలిపారు. ఆదివారం ఈజిప్టు వైపు నుంచి 17 ట్రక్కుల సహాయ సామాగ్రి గాజాలోకి ప్రవేశించింది. శనివారం 20 ట్రక్కుల సహాయం వెళ్లిన సంగతి తెలిసిందే. గాజా అవసరాలు తీరడానికి రోజుకు కనీసం 100 ట్రక్కుల సహాయం అవసరమని ఐరాస అంచనా వేస్తోంది.

ఇజ్రాయిల్ ద్వారా అమెరికా యుద్ధం చేస్తోంది : ఇరాన్

అణచివేతకు గురైన పాలస్తీనా సాధారణ ప్రజలపై ఇజ్రాయిల్ ద్వారా అమెరికా యుద్ధం చేస్తోందని ఇరాన్ విదేశాంగ మంత్రి హోసిన్ అమిర్ అబ్దోల్లాహియాన్ విమర్శించారు. ఆసుపత్రులు, మసీదులు, చర్చిలు, సాధారణ పౌరులపై ఇజ్రాయిల్ దాడులకు మద్దతు ఇచ్చేందుకు బైడెన్ వెళ్లడం దురదృష్టకరమని అన్నారు. గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న హత్యలు, సామూహిక హత్యలకు మద్దతుగా ఆయుధాలతో నిండిన వందలాది విమానాలు, షిప్‌లు, ట్రక్కులు పంపిస్తానని ప్రకటించడం శోచనీయమని విమర్శించారు.

పాలస్తీనాకు భారత్ సాయం.. 6.5 టన్నుల సామగ్రితో బయల్దేరిన విమానం

ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా నష్టపోయిన పాలస్తీనా ప్రజలకు సాయం అందించేందుకు భారత్ సిద్ధమైంది. సామగ్రి, ఔషధాలను ఆదివారం గాజాకు పంపించింది. 'ప్రాణాధార ఔషధాలు, శస్త్రచికిత్స వస్తువులు, గుడారాలు, స్లీపింగ్ బ్యాగ్స్, టార్పాలిన్లు, శానిటరీ యుటిలిటీస్, నీటి శుద్ధీకరణ మాత్రలు ఇతర వస్తువులను' మానవతా సాయంలో భాగంగా పంపిస్తున్నామని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ ట్విటర్‌లో(ఎక్స్)లో పోస్టు పెట్టారు. భారత వైమానిక దళానికి చెందిన ఐఎఎఫ్ సీ-17 విమానంలో మొత్తం 6.5 టన్నుల సామగ్రి వెళ్తోందని చెప్పారు. ఈ సామగ్రిని తొలుత ఈజిప్టులోని ఈఎల్-అరిష్ విమానాశ్రయానికి చేరుస్తారు. అక్కడి నుంచి రఫా సరిహద్దు గుండా గాజాకు తీసుకెళ్తారని తెలిపారు.

ఇజ్రాయిల్ దాడుల్లో గాయపడిన శిశువుకు వైద్యం చేస్తున్న దృశ్యం

యుద్ధాన్ని విస్తరిస్తున్న ఇజ్రాయిల్

- గాజాతో సహా వెస్ట్‌బ్యాంక్, సిరియాపైనా దాడులు

జెరూసలేం : హమాస్‌తో ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాన్ని ఇజ్రాయిల్ మరింత విస్తరించే దిశగా సాగుతోంది. ఆదివారం గాజాతో పాటు వెస్ట్‌బ్యాంక్, సిరియాపై కూడా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడింది. ఆదివారం తెల్లవారు జామున ప్రారంభమైన దాడులు సాయంత్రం వరకూ కొనసాగాయి. వెస్ట్‌బ్యాంక్‌లో ఒక మసీదుతోపాటు, సిరియాలో రెండు విమానాశ్రయాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. అలాగే ఈ యుద్ధం ప్రారంభమైన దగ్గర నుంచి కూడా లెబనాన్ యొక్క హిజ్బుల్లా మిలిటెంట్ గ్రూపుపైనా ఇజ్రాయిల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు గాజాపై భూతల దాడులకు కూడా ఇజ్రాయిల్ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. గాజా సరిహద్దుల వద్ద వందల యుద్ధ ట్యాంక్‌లతో సహా పది వేల మంది సైనికుల్ని మోహరింప చేసింది.

ఢిల్లీలో క్షీణిస్తున్న వాయు నాణ్యత

- కాలుష్య నిరోధక ప్రణాళిక రెండో దశ ప్రారంభం

న్యూఢిల్లీ : ఢిల్లీ- దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)లో వాయు నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ కాలుష్య నివారణ ప్రణాళిక స్టేజ్ 2ను అమల్లోకి తీసుకురానుంది. తాజాగా ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్య పరిస్థితిపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాలుష్య నివారణ ప్రణాళిక స్టేజ్ 2 అమలుపై చర్చ జరిగింది. శనివారం నాటికి ఢిల్లీలో 24 గంటల సగటు వాయు నాణ్యత సూచిక (ఎక్యూఐ) 248 పాయింట్లుగా ఉంది. ఈ నెల 23, 24 తేదీల్లో ఢిల్లీ, ఎన్‌సిఆర్‌లో వాయు కాలుష్యం మరింత దిగజారుతుందనే అంచనాలు వెలువడ్డాయి. అందువల్ల కాలుష్య నివారణ ప్రణాళిక స్టేజ్ 1 చర్యలతో పాటు స్టేజ్ 2 చర్యలు కూడా తీసుకోవాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. కాలుష్య నివారణ ప్రణాళికలను మొత్తంగా నాలుగు స్టేజ్‌లుగా వర్గీకరించారు. స్టేజ్ 1 - పూర్ (ఎక్యూఐ 201 నుంచి 300), స్టేజ్ 2 -వెరీ పూర్ (ఎక్యూఐ 301 నుంచి 400), స్టేజ్ 3 -తీవ్రం (ఎక్యూఐ 401 నుంచి 450), స్టేజ్ 4- సివియర్ ప్లస్ (ఎక్యూఐ 450 కంటే ఎక్కువ)గా విభజించారు. స్టేజ్ 1లో భాగంగా గాలిలో దూళిని తగ్గించడానికి మార్గదర్శకాలు సక్రమంగా అమలు చేయడం, అక్రమ నిర్మాణాల కూల్చివేత, హోటళ్లు, రెస్టారెంట్లు వద్ద బొగ్గు, కట్టెల వాడకంపై నిషేధాన్ని అమలు చేస్తారు. స్టేజ్ 2లో ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్ ఫీజులు పెంచడం, సిఎన్‌జి లేదా ఎలక్ట్రిక్ బస్సులు, మెట్రో సేవలను పెంచడం, వీటి సర్వీసులు పెంచడానికి అదనపు ఫ్లీట్‌లను ప్రవేశపెట్టడం వంటి చర్యలు చేపడతారు. స్టేజ్ 3లో పెట్రోల్, డీజిల్ ఇంజన్లతో నడిచే నాలుగు, అంతకంటే ఎక్కువ చక్రాలు ఉన్న వాహనాలను నిషేధిస్తారు. అనవసరమైన నిర్మాణం, కూల్చివేత పనులనూ నిలిపివేస్తారు. స్టేజ్ 4లో అన్ని రకాల నిర్మాణ, కూల్చివేత పనులనూ నిషేధిస్తారు. విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల కోసం వర్క్ ఫ్రం హోం వంటి చర్యలు అమలు చేస్తారు.

ఘజియాబాద్ కాలేజీలో మత నినాదాలు !

- ఇద్దరు టీచర్ల సస్పెన్షన్
- కాలేజీ డైరెక్టర్ వింత ప్రవర్తన

న్యూఢిల్లీ : కొత్త విద్యార్థుల పరిచయ కార్యక్రమం సందర్భంగా ఒక విద్యార్థి 'జై శ్రీరామ్' అంటూ పెద్దగా నినాదాలు చేస్తుండటంతో వేదికపై నుండి దిగిపోవాల్సిందిగా కోరిన ఇద్దరు ఫ్యాకల్టీ సభ్యులను సస్పెండ్ చేసిన ఘటన యుపిలో జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కి చెందిన ఇంజనీరింగ్ కాలేజీలో ఈ నెల 20న చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఫ్యాకల్టీ సభ్యుల చర్య పట్ల హిందూ మతతత్వ సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. వెంటనే మరో వీడియో కూడా బయటకు వచ్చింది. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తే ఏ కార్యక్రమానికీ అనుమతించబోమని మరో ఫ్యాకల్టీ సభ్యుడు విద్యార్థులను హెచ్చరించడం ఆ వీడియోలో కనిపించింది. పాలక బిజెపి, ఇతర హిందూత్వ సంస్థలు మతపరమైన నినాదాలను తమ కార్యక్రమాలు, ర్యాలీల్లో చేయడం, కాలేజీ, యూనివర్శిటీ ఆవరణల్లో వివిధ సందర్భాల్లో ఎబివిపి ఏదో ఒక రాజకీయ కారణంతో ఇటువంటి నినాదాలు చేయడం పరిపాటై పోయింది. వెంటనే ఈ వివాదం కాలేజీ కేంపస్‌కు పాకింది. టీచర్లు మమతా గౌతమ్, శ్వేత శర్మలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని హిందూ రక్ష దళ్ నిర్ణయించింది. దాంతో పోలీసులు వెంటనే కాలేజీ కేంపస్ దగ్గర సిబ్బందిని మోహరించారు.

ఆ తర్వాత కాసేపటికి, ఆ విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ ఎబిఇఎస్ ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ సంజయ్ కుమార్ సోషల్ మీడియాలో తెలిపారు. పైగా టీచర్ల ప్రవర్తనపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని వేసినట్లు తెలిపారు. ఆ టీచర్ల వ్యవహార శైలి సముచితంగా లేదంటూ సంజయ్ కుమార్ ఇన్‌స్టాగ్రామ్‌లో మరో వీడియో పోస్టు పెట్టారు. 24గంటల్లోగా కమిటీ తన సిఫార్సులు ఇవ్వాలంటూ ఆదేశించారు. వాటికి కట్టుబడి వుంటామని తెలిపారు. అనంతరం, కమిటీ చేసిన సిఫార్సుకు అనుగుణంగానే ఆ ఇద్దరు ఫ్యాకల్టీ సభ్యుల సేవలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సస్పెండైన టీచర్లలో ఒకరైన మమతా గౌతమ్ అనంతరం ఒక వీడియో ప్రకటన చేస్తూ, జై శ్రీరామ్ నినాదాన్ని తాను వ్యతిరేకించలేదని, వేదికపై నుండి దిగిపోయిన ఆ విద్యార్థి తనతో వాదన పెట్టుకున్నాడని, అది తాను వ్యతిరేకించానని చెప్పారు. తన సనాతన మూలాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ ఆన్‌లైన్‌లో అల్లరి మూక తనను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. ఈ విషయంపై దర్యాప్తు చేపట్టామని, తగు చర్యలు తీసుకుంటామని స్థానిక పోలీసులు తెలిపారు.

విధుల్లో ఉన్న అగ్నివీర్ మృతి

లేహ్: విధి నిర్వహణలో ఉన్న అగ్నివీర్ మరణించాడు. లడఖ్‌లోని హిమాలయ పర్వతాల్లో అత్యంత ఎత్తులో ఉన్న సియాచిన్ ఆర్మీ శిబిరంలో ఈ సంఘటన జరిగింది. లేహ్‌లోని ఆర్మీ ప్రధాన కార్యాలయం ఫైర్ అండ్ ఫ్యూరీ కార్ప్స్ ఆదివారం ఈ విషయం తెలిపింది. మహారాష్ట్రకు చెందిన అగ్నివీర్ గవాతే అక్షయ్ లక్ష్మణ్ మరణం పట్ల ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, ఇతర సైనికాధికారులు సంతాపం తెలపడంతోపాటు నివాళి అర్పించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అగ్నివీర్ లక్ష్మణ్ ఎలా చనిపోయాడనేది వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కాంట్రాక్ట్ విధానం ద్వారా త్రివిధ దళాల్లోకి రిక్రూట్ చేసుకునే అగ్నివీర్ స్కీమ్‌పై దేశ వ్యాప్తంగా నిరసనలు, విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. కారకోరం పర్వత శ్రేణిలో సుమారు 20,000 అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్ హిమానీనదం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మిలిటరైజ్డ్ జోన్‌గా పేరుగాంచింది. దేశ రక్షణ కోసం ఇక్కడ విధులు నిర్వహించే భారత సైనికులు శత్రువులతోపాటు తీవ్రమైన చలి వాతావరణంతో పోరాడాల్సి ఉంటుంది. ఇక్కడి వాతావరణాన్ని తట్టుకోలేకపోవడం, పాదాలు, కాళ్లు, చేతులు మొద్దుబారడం వంటి అనారోగ్య సమస్యలను ఆర్మీ జవాన్లు తరచూ ఎదుర్కొంటున్నారు.

కేంద్రం చేతిలో రాష్ట్రాల గుట్టు

(మొదటి పేజీ తరువాయి)

ఉండక పోవడంతో పాటు ఫైల్స్ అన్ని కూడా ఇ-ఆఫీస్ కు అనుసంధానం చేయడంతో పరిపాలన మరింత వేగవంతం అవుతుందని ఎన్ఐసి అధికారులు పేర్కొంటున్నారు. ఈ పోర్టల్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారి నుండి ఏ సమాచారం కావాలన్నా జిల్లా స్థాయి అధికారులు వెంటనే పొందుపరచి వారి లాగిన్ నుంచి పంపే వీలుంటుంది. ఫలితంగా ఎటువంటి ప్రైవేట్ మెయిల్స్ వాడాల్సిన అవసరం రాదని, రానున్న రోజుల్లో వీటి వినియోగం పెరుగుతుంది అని ఎన్ఐసి అధికారులు పేర్కొంటున్నారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా బిగిస్తున్న పిడికిళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ర్యాలీ నిర్వహించారు. తాజాగా ఈ నెల21న జరిగిన మార్చ్‌లో మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు, విద్యావేత్తలు, హక్కుల కార్యకర్తలు, బ్రిటిష్ సాధారణ పౌరులు పాల్గొన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీలో డజనుకుపైగా విద్యార్థి సంఘాలు సంతకాల సేకరణకు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదలజేశాయి.ఆ ప్రకటన మొదటి వాక్యంలో హార్వర్డ్ పాలస్తీనా సాలిడారిటీ కమిటీ సారథ్యంలో దిగువ సంతకాలు చేసిన మేము' ఈ ప్రాంతం (పశ్చిమాసియాలో) అన్ని రకాల హింసకు ఇజ్రాయిల్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని నిందించాల్సి ఉంది' అని పేర్కొన్నారు. ఒక పథకం ప్రకారం పాలస్తీనా భూములను ఆక్రమించడం, నిర్బంధాన్ని ప్రయోగించడం, సైనిక తనిఖీలు, బలవంతంగా కుటుంబాలను వేరుపరచడం, టార్గెట్‌గా హత్యలు చేయడం వంటి వాటికి ఇజ్రాయిల్‌లోని యూదు దురహంకార ప్రభుత్వాలే కారణమని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిరసనలపై బ్రిటన్‌లో శక్తివంతమైన అపర కుబేరుడు, హెడ్జ్ ఫండ్ సంస్థ సిఇవో జర్రున ఇంత ఎత్తున లేచాడు. హార్వర్డ్ వర్సిటీ పాలకమండలిలో సభ్యుడైన ఈ సిఇవో పాలస్తీనాకు సాలిడారిటీ తెలిపిన విద్యార్థుల పేర్లను బయటకు విడుదల జేయాలని, ఉద్యోగాలు రాకుండా వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలని ట్వీట్ చేశారు. ఫ్రాన్స్‌లో అసలు పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలే చేయరాదంటూ అక్కడి మాక్రాన్ ప్రభుత్వం నిషేధాజ్ఞలు జారీ చేశారు. అయినా, వాటిని ధిక్కరించి టౌలోజ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో భారీ మార్చ్ నిర్వహించారు. విద్యార్థులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్, వాటర్ కెనాన్‌లను ప్రయోగించింది. నిరసనలపై ఉక్కు పాదం మోపుతోంది. ముస్లింలు, యూదులు గణనీయమైన సంఖ్యలో ఉన్న యూరప్ దేశాల్లో ఫ్రాన్స్ ఒకటి. ప్రభుత్వం ఇటువంటి నిర్బంధాలు, ఆంక్షలతో మా నోర్మూయించలేరు అని ఫ్రాన్స్ విద్యార్థులు ఎలుగెత్తి చాటారు.

మాంచెస్టర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు పాలస్తీనీయులకు సంఘీభావంగా నిలిచినందుకు వర్సిటీ అధికారులు ఆమెపై దర్యాప్తునకు ఆదేశించారు.బర్మింగ్ హామ్, గ్లాస్గో వంటి యూనివర్సిటీల్లో విద్యార్థులపై క్రమశిక్షణా చర్యల పేరుతో కొన్ని రోజులపాటు సస్పెండ్ చేశారు. జర్మనీలోని బెర్లిన్‌లో పాలస్తీనా జెండాను పట్టుకున్నందుకు పదిహేనేళ్ల విద్యార్థిని టీచర్ చితకబాదారు. ఆ విద్యార్థిని కొన్ని వారాలపాటు సస్పెండ్ చేశారు. దీనిపై పెద్దయెత్తున విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగడంతో ఆ స్కూల్ యాజమాన్యం టీచర్‌ను సిక్ లీవ్‌పై పంపింది.

వివిధ దేశాల్లో విద్యార్థుల నిరసనలపై ఆయా ప్రభుత్వాలు నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని బ్రిటన్‌కు చెందిన ఇంటర్నేషనల్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫర్ ఈక్వాలిటీ (ఐవైఎస్ఎస్ఇ) ఖండించింది. ఈ మేరకు అది ఒక పిటిషన్ రూపొందించింది. దీనిపై సంతకాలు చేసినవారిలో పాలస్తీనా అనుకూల అభిప్రాయాలు వ్యక్తం చేసినందుకు వేధింపులకు గురైన కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రషీద్ ఖలీద్, శాన్‌ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీ రజాక్ అబ్దుల్ , మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ నజీర్‌తోబాటు స్కాలర్, జర్నలిస్టు విజయ్ ప్రసాద్, చరిత్రకారుడు రోక్సో ధన్‌లాల్ ఆర్టిజ్, అమెరికన్ రాజకీయ ఖైదీ జలీల్ ముంతాకిమ్ ఉన్నారు.

'ఆ' మందులే కొనండి

(మొదటి పేజీ తరువాయి)

టాబ్లెట్లు కొంటున్నారు. ఈ ఏడాది కూడా అవసరాలకు సరిపడా ఇప్పటికే కొనుగోలు చేశారు. అయినా, మళ్లీ కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం వాడుతున్న 279 రకాల్లో మందుల్లో అధికశాతం అవసరాల మేరకు స్టాక్ ఉన్నప్పటికీ దానితో నిమిత్తం లేకుండానే రెండు, మూడు నెలల్లో అదనంగా గోలు చేయాలని ఆదేశించినట్లుతెలిసింది. కొన్ని డిస్పెన్సరీలు ఇప్పటి వరకు రూ.10 లక్షల నుండి రూ.15 లక్షల విలువైన మందులకు మాత్రమే ఇండెంట్ పెడుతుండగా, వాటిని కూడా రూ.25 లక్షల నుండి రూ.40 లక్షల వరకూ ఇండెంట్ పెంచి మందులు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం, అదనంగా కొనుగోలు చేస్తే వాటి వినియోగం ఉండదని చెబుతున్నా పట్టించుకోవడం లేదని తెలిసింది.

నేడు జనసేన- టిడిపి సమన్వయ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
టిడిపి, జనసేన పార్టీల సమన్వయ కమిటీ తొలి సమావేశం రాజమండ్రిలోని మంజీర హోటల్‌లో ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం మధ్యాహ్నం 1 గంటకు మధురవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా మంజీర హోటల్‌కు వెళ్తారు. ఈ సమన్వయ కమిటీ సమావేశానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా హాజరుకానున్నారు.

26 నుంచి వైసిపి సామాజిక సాధికారిక బస్సుయాత్ర

- మంత్రి బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)
రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పాలనను ప్రజలకు వివరించేందుకు ఈ నెల 26 నుంచి సామాజిక సాధికారిక బస్సు యాత్రను ఉత్తరాంధ్రలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. బీచ్ రోడ్డులోని వెల్‌కం హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వాలు పేద, బడుగు, బలహీనవర్గాల వారిని పూర్తిగా విస్మరించాయని, వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించి వారి జీవన స్థితిగతులను మార్చేసిందని తెలిపారు. ప్రజాహిత కార్యక్రమాల వివరాలను బస్సుయాత్ర ద్వారా ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఎనిమిదో తరగతి పిల్లలకు ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తున్నామని, దీనిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అవగాహన లేకుండా మాట్లాడుతుండడం సరికాదన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కావాలని పదేపదే కేంద్రాన్ని కోరామని, ఇప్పటికీ స్పందన కనిపించలేదని తెలిపారు. సామాజిక సాధికారిక బస్సు యాత్ర ఈ నెల 26న ఇచ్ఛాపురంలో ప్రారంభమై ఉత్తరాంధ్ర అంతటా సాగి 9న అనకాపల్లిలో ముగుస్తుందన్నారు. ఈ యాత్రలో ఉత్తరాంధ్ర మంత్రులందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపిలు భీశెట్టి సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

52 మందితో బిజెపి తొలి జాబితా విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బిజెపి విడుదల చేసింది. 52 మందితో జాబితాను ఆదివారం వెల్లడించింది. కరీంనగర్ నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, కోరుట్ల నుంచి ధర్మపురి అర్వింద్ పోటీ చేయనున్నారు. గజ్వేల్, హుజూరాబాద్ రెండు స్థానాల నుంచి ఈటల రాజేందర్ బరిలో నిలవనున్నారు. ముందుగా ప్రకటించిన విధంగానే గజ్వేల్‌లో సిఎం కెసిఆర్‌పై ఈటల బరిలోకి దిగుతున్నారు. దుబ్బాక నుంచి రఘునందన్ రావు, ఖైరతాబాద్ నుంచి చింతల రామచంద్రా రెడ్డి పోటీ చేయనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయడంతో మళ్లీ గోషామహల్ నుంచి ఆయనే బరిలోకి దిగుతున్నారు. సిరిసిల్లలో మంత్రి కెటిఆర్‌పై బిజెపి మహిళా అభ్యర్థి రాణిరుద్రమ రెడ్డిని పోటీకి నిలిపింది.

రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేసిన బిజెపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై బిజెపి సస్పెన్షన్ ఎత్తివేసింది. ఈ మేరకు బిజెపి కేంద్ర క్రమశిక్షణ సంఘం సభ్య కార్యదర్శి ఓం పాఠక్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన విడుదలైన కాసేపటికే బిజెపి ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో గోషామహల్ నుంచి రాజాసింగ్ పేరు ప్రత్యక్షమైంది. వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో గతేడాది ఆగస్టు 23న ఆయన్ను బిజెపి సస్పెండ్ చేసింది. వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఆ పార్టీ ఆదేశించింది. రాజాసింగ్ తన వివరణ ఇచ్చారు. దీంతో బిజెపి తాజాగా సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.

సరుకు ఎలా తరలించాలా!

- తవ్విన తెల్లరాయిని అడవుల్లోనే వదిలివెళ్లిన మాఫియా
- ఈటాచీలు, జెసిబిలు, టిప్పర్లు, లారీలను ప్రత్యేక ప్రాంతాల్లో దాచిపెట్టిన వైనం
- 'ప్రజాశక్తి' కథనంపై రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆరా

పెరుమళ్లపాడు వద్ద హిటాచీలతో తవ్వకాలు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి
సైదాపురంలో వైట్ స్టోన్స్ (ఎస్‌డబ్ల్యుఎస్) మాఫియాపై 'నెల్లూరులో కెజిఎఫ్' పేరుతో ప్రజాశక్తిలో ఆదివారం ప్రచురితమైన కథనంపై అధికార యంత్రాంగంలో తీవ్ర చర్చ సాగుతోంది. గుట్టుచప్పుడు కాకుండా కొందరు రాజకీయనేతలు, అధికారుల సహకారంతో దేశ సరిహద్దులు దాటిపోతోన్న తెల్లరాయి వ్యవహారం బయటకొచ్చింది. దీనిపై రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీయడంతో స్థానిక అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అక్రమ తవ్వకందారులు శనివారం మధ్యాహ్నం సమయానికి ఎక్కడ సరుకు అక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఎస్‌బి అధికారులు మాఫియాపై దృష్టి పెట్టినట్లు సమాచారం. దీంతో, ఈ వ్యవహారం తమ పీకకు చుట్టుకుంటుందోమోనని ఆందోళనతో స్థానిక అధికారులు ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల దృష్టి సారించడంతో అక్రమ రవాణాకు మాఫియా కొంత బ్రేక్ ఇచ్చింది. ఎక్కడ లారీలు అక్కడే నిలిచిపోయాయి. అటవీ, ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేస్తున్న ఈటాచీలు, జెసిబిలు, టిప్పర్లు, లారీలను దగ్గరోని ప్రత్యేక ప్రాంతాల్లో దాచిపెట్టినట్లు సమాచారం. కోట్ల రూపాయల విలువైన రాయి తరలించడానికి సిద్ధం కాగా, ఈ పరిస్థితుల్లో ఎలా తరలించాలనే విషయమై మాఫియా ఇప్పుడు మల్లగుల్లాలు పడుతోంది. తవ్వకాలు చేసిన బండరాళ్లను ఎక్కడక్కడే వదిలేశారు. తమ వద్ద ఉన్న నిల్వలు ఎలా తరలించాలనే విషయంపై ప్రత్యేకంగా భేటీ అయినట్లు తెలుస్తోంది. అన్ని శాఖల అధికారులకూ సమాచారం ఉన్నప్పటికీ అధికార పార్టీ నేతల బెదిరింపులకు భయపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఉన్నతాధికారులు సైదాపురంలో ఏం జరుగుతోంది? అనే విషయంపై ఆరా తీస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతోన్న ఈ వ్యవహారం బయటకు రావడం, వేల కోట్ల కుంభకోణం కావడంతో స్థానిక అధికార యంత్రాంగం గుంబనంగా ఉంది. ఫోన్లకు అందుబాటులోకి రావడం లేదు. మైనింగ్, అటవీ, శాఖ అధికారులు తమ చేతుల్లో ఏం లేదని, తాము ఏమి చేయగలమని అంటున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అధికార పార్టీ పెద్దల ప్రమేయం ఉండడం, భారీగా తాయిలాలు అందడంతో ఏ ఒక్కరూ ఈ విషయాల గురించి మాట్లాడడం లేదు. అటవీ శాఖ భూముల్లోకి ఎవరు వెళ్లాలన్నా భయపడిపోతారు. చట్టాలు అంత కఠినంగా ఉంటాయి. అటవీ భూముల్లో తెల్లరాయి తవ్వుకుపోతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మైనింగ్ అధికారులు లెస్సెన్స్ తనిఖీ చేయాలి. రెవెన్యూ అధికారులు నిత్యం పరిశీలన జరపాలి. ఇంత పెద్ద కుంభకోణం సాగుతున్నా ఇటువంటివి ఏమీ జరగడం లేదు. వందలాది టిప్పర్లు, లారీలు, 500 ఈటాచీలు ఇక్కడ కలియ తిరిగినా చూసీచూడనట్లు వ్యవహరించారు. ఈ కుంభకోణం బయటకు రావడంతో ఇప్పుడు ఎక్కడ దొంగలు అక్కడే గప్‌చిప్‌గా ఉన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 50 మైనింగ్ డీలర్ లెసెన్స్ (ఎండిఎల్) యార్డ్స్ ఉన్నాయి. పెద్దపెద్ద రాళ్లను ఇక్కడే చిన్నచిన్న ముక్కలుగా చేసి, లారీల్లో సైదాపురం నుండి చెన్నైయ్‌కు తరలిస్తుంటారు. ఒక్కో యాడ్ వద్ద సుమారు 500 టన్నుల వరకు నిల్వ ఉన్నట్లు తెలుస్తోంది. అడుగు రాయిని పౌడర్ చేసి ఒక్కో టన్ను బస్తాల్లో నింపుతారు. ఈ పౌడర్ తయారు చేయడానికి సైదాపురంలోని జోగేపల్లిలో రెండు, ఊటు కూరులో 2, పెరుమళ్లపాడులో 3, చాగణంలో మరో 3 ఫ్యాక్టరీ ఉన్నాయి. ఇక్కడ వందల టన్నుల పౌడర్ నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది.

కుంగిన మేడిగడ్డ బ్యారేజీ వంతెన

- మహారాష్ట్ర- తెలంగాణ మధ్య రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సమీపంలో నిర్మించిన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ వంతెన శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా కుంగిపోయింది. భారీ శబ్దంతో వంతెన ఒక అడుగు మేర కుంగినట్లు బ్యారేజీ ఇంజనీర్లు తెలిపారు. బ్యారేజీ 20వ పిల్లర్ కుంగడంతోనే పైన వంతెన కుంగినట్లు అంచనా వేస్తున్నారు. ముందు జాగ్రత్తగా బ్యారేజీ పై నుంచి రాకపోకలను నిలిపివేశారు. దీంతో మహారాష్ట్ర - తెలంగాణ రాష్ట్రాల మధ్య ట్రాఫిక్ స్తంభించింది. బ్యారేజీ పొడవు 1.6 కిలోమీటర్లు ఉండగా సంఘటన జరిగిన ప్రదేశం మహారాష్ట్ర వైపు నుంచి 356 మీటర్ల సమీపంలో ఉంది. బ్యారేజీ కుంగిన సమయానికి ఎగువ నుంచి జలాశయానికి 25 వేల క్యూసెక్కుల వరకు ప్రవాహం వస్తుండగా ఎనిమిది గేట్లు తెరిచి దిగువకు వదులుతున్నారు. వంతెన కుంగిన నేపథ్యంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా జలాశయాన్ని ఖాళీ చేయడం ప్రారంభించారు. మొదట 12 గేట్లు, ఆ తరువాత వాటిని 46కు పెంచి కొంత మేరకు జలాశయాన్ని ఖాళీ చేశారు. ఈ ఘటనలో అసాంఘిక శక్తుల ప్రమేయమేదైనా ఉండొచ్చనే అనుమానంతో డ్యాం ఇంజనీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిజైన్ లోపం లేదు - ఇఎన్‌సి

మేడిగడ్డ బ్యారేజి కుంగిపోవడంపై నిపుణుల బృందం పరిశీలిస్తోందని కాళేశ్వరం ప్రాజెక్టు ఇఎన్‌సి నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్లో ఎలాంటి లోపం లేదని, ఈ ప్రాజెక్టును ఎల్ అండ్ టి కంపెనీ నిర్మించిందని చెప్పారు. బ్యారేజీ కుంగుబాటు తర్వాత నీటిని దిగువకు విడుదల చేశామని, త్వరలోనే మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు.

నాణ్యతాలోపం వల్లే కుంగిపోయింది

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి - కాంగ్రెస్

ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన రీడిజైనింగ్ వల్లే కాళేశ్వరం నష్టదాయకంగా మారిందని, నాణ్యతాలోపం వల్లే వంతెన కుంగిపోయిందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రాజెక్టుల డిజైన్లు తానే రూపొందించానన్న కెసిఆర్ ఇప్పుడెందుకు మాట్లాడడం లేదని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క ప్రశ్నించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు డొల్లతనం, నిజస్వరూపం ఇప్పుడు బయపడిందని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. వరదలు లేకుండానే బ్యారేజీ వంతెన కుంగిపోవడం ఏమిటని ప్రశ్నించారు. కాళేశ్వరం పనులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు ఏ పార్టీ మద్దతివ్వలేదు

- పవన్‌కల్యాణ్ ఒక్కరే పరామర్శించారు : అంబటి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి
ఆధారాలన్నీ ఉన్నందువల్లే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు అరెస్టయ్యారని నీటి పారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి ఇప్పటి వరకు ఏ కేసులోనూ చంద్రబాబు అరెస్టు కాకుండా తప్పించుకున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో ప్రభుత్వం అన్ని ఆధారాలతో ఆయనను అరెస్టు చేయడంతో టిడిపి నాయకులు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. వ్యవస్థలను మేనేజ్ చేసి చంద్రబాబును అరెస్టు చేశారని లోకేష్ ఆరోపించడాన్ని ఆయన ఖండించారు. ఎలాంటి తప్పు చేయకపోతే దేశంలో ఇతర పార్టీలకు చెందిన ఒక్క నాయకుడైనా జైలులో చంద్రబాబును ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. టిడిపి, జనసేన ఒక్కటేనని, అందుకే పవన్ కల్యాణ్ ఒక్కరే రాజమండ్రి జైలుకు వచ్చారని తెలిపారు. అసెంబ్లీలో తనకు అవమానం జరిగిందని చంద్రబాబు మీడియా ముందు ఏడ్చేందుకు నటించారని, తన తండ్రిని అరెస్టు చేశారని లోకేష్ ఏడవడంలో ఆవేదన కనిపించిందని తెలిపారు. సానుభూతి కోసం భువనేశ్వరి నిజం పేరుతో యాత్రకు సిద్ధమవుతున్నారని అన్నారు. ప్రజలకు అన్ని నిజాలు ఇప్పటికి తెలిశాయన్నారు. దేశంలో రాజకీయాలను వ్యాపారంగా, ఎన్నికలను ఖరీదుగా మార్చింది చంద్రబాబేనని విమర్శించారు. ఎన్‌టిఆర్ హయాం వరకు ఎన్నికల ఖర్చు చాలా తక్కువని, 1995 నుంచి చంద్రబాబు వచ్చిన తరువాత ఎన్నికల ఖర్చు భారీగా పెంచారని పేర్కొన్నారు. కాగా చంద్రబాబు ప్రజలకు రాసిన బహిరంగ లేఖలో ప్రస్తావించిన అంశాలను కూడా అంబటి తప్పుబట్టారు. ఈ లేఖకు ప్రతిగా చంద్రబాబుకు అంబటి బహిరంగ లేఖ రాశారు. ఓటమి భయంతో ఎవ్వరూ చంద్రబాబును జైలులో ఉంచలేదని, అవినీతికి పాల్పడినందునే ఆయన జైలు పాలయ్యారని ఆ లేఖలో అంబటి పేర్కొన్నారు.


గవర్నర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

స్వర్ణరథంపై శ్రీ వేంకటాద్రీశుడి విహారం

ప్రజాశక్తి - తిరుమల
తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో శ్రీ మలయప్ప స్వామివారిని స్వర్ణరథంపై ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ తిరు మాడవీధుల్లో రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆయల ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు, ఇఒ ఎవి.ధర్మారెడ్డి దంపతులు, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జెఇఒ సదా భార్గవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుమల శ్రీవారిని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో గవర్నర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అష్ఫాకుల్లా ఖాన్ స్ఫూర్తితో

బిజెపి విధానాలను ఎండగడదాం

- జయంతి సభల్లో పలువురు వక్తలు

ప్రజాశక్తి- యంత్రాంగం
బిజెపి మతోన్మాద విధానాలను స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాకుల్లా ఖాన్ స్ఫూర్తితో ఎండగడదామని, విభజన హామీల కోసం ఉద్యమిద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అష్ఫాకుల్లా ఖాన్ 123వ జయంతి ఆవాజ్, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో ఆదివారం జరిగింది. తొలుత ఆయన చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కడపలో అష్ఫాకుల్లా ఖాన్‌కు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ నివాళులర్పించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం 27 సంవత్సరాల వయస్సులోనే ప్రాణాలను అర్పించారు ధీరుడని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మత సామరస్యం పాటించి మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిపారు. నేడు బిజెపి ప్రభుత్వం కులాలు, మతాల పేరుతో దాడులకు పాల్పడుతోందని చెప్పారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చట్టబద్ధంగా రాసుకున్నా పరిశ్రమను ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని నిలదీయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. బిజెపి విధానాలను తిప్పికొట్టాలని కోరారు. కర్నూలులో ఆవాజ్ ఆధ్వర్యంలో జరిగిన సభలో అవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, షేక్ మొహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ బిజెపి విధానాలను ఎండగట్టారు. నెల్లూరులో అష్ఫాకుల్లా ఖాన్ చిత్రపటానికి ఆవాజ్ నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు.

కడపలో అష్ఫాకుల్లా ఖాన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

బన్నీ ఉత్సవానికి భారీ బందోబస్తు

- 1100 మంది పోలీసులతో పహారా
- అగ్గి దివిటీలు, ఇనుప రింగులు తొడిగిన కర్రలపై నిషేధం
- దేవరగట్టులో ఈసారైనా కర్రల సమరం ఆగేనా?

గత ఏడాది కర్రల సమరంలో పాల్గొన్న భక్తులు (ఫైల్)

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి
కర్నూలు జిల్లాలో ప్రసిద్ధి చెందిన బన్ని ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 వరకు జరగనున్నాయి. హోళగుంద మండలం దేవరగట్టులో నిర్వహించే బన్ని ఉత్సవాల్లో రక్తం చిందకుండా ఆపేందుకు పోలీసులు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు 1100 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అగ్గి దివిటీలు, ఇనుప రింగులు తొడిగిన కర్రలను నిషేధించారు. ఇప్పటికే 800 రింగులు తొడికిన కర్రలను స్వాధీనం చేసుకున్నారు. దేవరగట్టు కొండ పరిసర ప్రాంతాలైన సులువాయి, మునానుగుంది, అరికెర, కొండపైకి వెళ్లే దారిలోని బిలేహాల్ వంటి పది చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలకు కొండ దగ్గరకు అనుమతించడం లేదు.

24న కర్రల సమరం

బన్నీ ఉత్సవాల్లో విజయదశమి రోజు (ఈ నెల 24వ తేదీ) అర్ధరాత్రి కర్రల సమరానికి సమాయత్తమవుతున్నారు. ప్రతియేటా ఈ సమరంలో కర్రలు కరాళ నృత్యం చేస్తుంటాయి. ఉత్సవమూర్తులను దక్కించుకోవడానికి వేలాది మంది కర్రలతో సమరానికి సై అంటూ రంగంలోకి దిగుతారు. దేవరగట్టు కొండ ప్రాంతంలోని 11 గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాన్ని జరుపుకుంటున్నారు. కొండపై ఉన్న మాలమల్లేశ్వస్వామికి దసరా పండగ రోజు అర్ధరాత్రి కల్యాణం జరుగుతుంది. అనంతరం మాల సహిత మల్లేశ్వరస్వామి విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్తారు. ఆ విగ్రహాలకు నెరణికి, నెరణికి తండా, కొత్తపేటకు చెందిన మూడు గ్రామాల ప్రజలు రక్షణగా నిలుస్తారు. ఒక గ్రూపువారు విగ్రహాలను తీసుకెళ్తుంటే, మరో గ్రూపు వారు ఆపే ప్రయత్నం చేస్తారు. ఇలా రెండు గ్రూపుల మధ్య కర్రల సమరం నడుస్తుంటుంది. అనంతరం విగ్రహాలను తిరిగి దేవరగట్టు మీద ఉంచడంతో ఉత్సవం పూర్తవుతుంది. కర్రల సమరంలో వందలాది మంది తలలు పగులుతుంటాయి. కర్రలతో కొట్టుకోకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలని అధికారులు ప్రతి ఏడాదీ ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కానీ కర్రల సమరం ఆగింది లేదు. గతేడాది కూడా 98 మందికి గాయాలయ్యాయి. ఈ ఏడాదైనా తెర పడుతుందా లేదా అనేది వేచిచూడాలి.

'వాచాతి' పోరాట విజయం దేశానికే ఆదర్శం

- ప్రజా సంఘాల సదస్సులో పలువురు వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా వాచాతి గ్రామ ప్రజల పోరాట విజయం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రజా సంఘాలకు చెందిన పలువురు వక్తలు కొనియాడారు. వాచాతి ప్రజల పోరాటనికి మద్రాసు హైకోర్టు తమ తీర్పులో అభినందనలు తెలిపిందన్నారు. విజయవాడలోని రెడ్ సర్కిల్ వద్ద బెల్లపు శోభనాద్రి గ్రంథాలయంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.క్రాంతి కుమార్ అధ్యక్షతన 'వాచాతి' అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధార కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారులు, పెత్తందార్లు బరితెగించి అఘాయిత్యాలకు, సామూహిక అత్యాచారాలకు పాల్పడితే వాటిని ఎదురించి సుదీర్ఘకాలం న్యాయపోరాటం చేసి వాచాతి ప్రజలు విజయం సాధించారని కొనియాడారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ 1992 జూన్ 20న అటవీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎర్రచందనం స్మగ్లర్లను వెతకాటానికి వాచాతి గ్రామంలోని ప్రవేశించి సోదాల పేరిట 18 మంది మహిళలను సామూహికంగా అత్యచారం చేశారని నాటి దురాగతాలను గుర్తు చేశారు. ఇందులో 269 మంది దోషులుగా గుర్తించగా ఈ మధ్యకాలంలోనే 54 మంది దోషులు మరణించారని, మిగతా 126 మంది అటవీ సిబ్బంది, 84 మంది పోలీసులు, 5 గురు రెవెన్యూ అధికారులను కోర్టు దోషులుగా గుర్తించిందన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ వాచాతి గ్రామ ప్రజల పోరాటం స్ఫూర్తివంతమైదన్నారు. 31 సంత్సరాల సుధీర్ఘ పోరాట చరిత్రలో ప్రజా సంఘాలు కీలక పాత్ర షోషించడంతో దోషులకు శిక్షలు పడ్డాయన్నారు. సభాధ్యక్షులు క్రాంతి కుమార్ మాట్లాడుతూ వాచాతి విజయోత్సవ దినోత్సవాన్ని రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, శ్యాం, జి.నటరాజ్, చింతల శ్రీనివాస్, సావిత్రమ్మ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న లక్ష్మణరావు

కలెక్టర్ కార్యాలయాల్లో శంకరన్ విగ్రహం ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-బాపట్ల
రాష్ట్రంలో ప్రతి కలెక్టర్ కార్యాలయం ఆవరణలో విశ్రాంత ఐఎఎస్ అధికారి, కీర్తిశేషులు ఎస్ఆర్ శంకరన్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ప్రజలకు ఆయన అందించిన సేవలు భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. శంకరన్ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో బాపట్ల కలెక్టరేట్ వద్ద ఆదివారం శంకరన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఐఎఎస్ వ్యవస్థను మానవీయం చేసిన అధికారి శంకరన్ అన్నారు. నిరుపేదల కలెక్టర్‌గా ఆయన ఖ్యాతికెక్కారని వివరించారు. నిరుపేదల ప్రయోజనం కోసం 120 జిఒలు జారీ చేశారన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల ఏర్పాటుకు ఆయన ఎంతగానో కృషి చేశారని తెలిపారు. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు శంకరన్ జీవితంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు మెడల్స్‌ను జిల్లా రెవెన్యూ అధికారి పి వెంకటరమణతో కలిసి లక్ష్మణరావు అందజేశారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎం గేయానంద్, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామారావు, ఫోరమ్ కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, వెలగా శివరామయ్య, జివి రాజారావు, సిపిఐ నాయకులు శ్రీధర్, సిపిఎం నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

POONAWALLA HOUSING FINANCE Apna Ghar, Apni Pehchan
POONAWALLA HOUSING FINANCE LIMITED
(FORMERLY, MAGMA HOUSING FINANCE LIMITED)
CORRIGENUDM FOR POSSESSION NOTICE

రిజిస్టర్డు ఆఫీసు: 602, 6వ అంతస్తు, 21 ఐటి పార్క్, ఎస్ఆర్ నం.79/1, ఘోర్‌పాడి, ముంధ్వ రోడ్, పూణే-411036
ఏదైతే తేది: 22.10.2023నాటి ఈ దినపత్రికలో ప్రకటించబడిన స్వాధీనతా ప్రకటన అనుసరించి, లోన్ అకౌంట్ నం. హెచ్ఎం/0053/హెచ్/17/100343 పై స్వాధీనతా నెలను తప్పుగా ప్రచురించుట జరిగింది.
దయచేసి దానిని 16 అక్టోబర్ 2023గా చదువగలరు.
అన్ని ఇతర విషయాలలో మార్పులేదు.

ప్రదేశం: విజయవాడ
తేది: 23.10.2023
పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున
(గతంలో మగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరుగలది)
అధీకృత అధికారి

ఐబిసి-2016 క్రింద విక్రయ నోటీసు
మెసర్స్. శ్రీ పంచజన్య పవర్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)
లిక్విడేటర్స్ చిరునామా : ప్లాట్ నం.106, హౌ.నం.8-27, రోడ్డు నం.10, మైత్రి పురం కాలనీ, జిల్లేల్ గూడ, వైశాలి నగర్ పిఒ, హైదరాబాద్-500 079, తెలంగాణ.

ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంకప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రక్రియ) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 32(ఇ) క్రింద లిక్విడేటర్ ద్వారా మెసెర్స్. శ్రీ పంచజన్య పవర్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్ లో), తో కలిపి లిక్విడేషన్ ఎస్టేట్ యొక్క క్రింది అసెట్స్ మరియు ఆస్తుల ఏర్పడిన భాగానికి సంబంధించిన అమ్మకం కొరకు దిగువ సంతకం దారుని ద్వారా విక్రయించబడును ఇ-వేలం ప్లాట్‌ఫారం : https://www.bankauctions.in/ పేర్కొన్న తేదీ మరియు సమయం ఇక్కడ క్రింద ఉన్నాయి :

అసెట్ వివరణ	విక్రయ పద్ధతి	తనిఖీ తేది	వేలం తేది మరియు సమయం	రిజర్వు ధర రూ. లక్షలలో	ఇఎమ్‌డి మొత్తం మరియు బిడ్ సమర్పణ డెడ్‌లైన్
కంపెనీ మొత్తం 10 ఎమ్‌డబ్ల్యూ బయోమాస్ ఆధారిత పవర్ ప్లాంట్ను కలిగి, సి-9, ఎమ్ఐడిసి ఇండస్ట్రియల్ ఏరియా, లింబాల (గ్రా), హింగోలి టిక్యూ మరియు డిటి, మహారాష్ట్ర వద్ద ఉంది. లీజు హోల్డ్ ఇంట్రస్ట్ కలిగి ఉన్న స్థలంలో కొలిచే 3,35,612 చ.మీ.లు. (ఎమ్ఐడిసి డబ్ల్యూ.ఇ.ఎఫ్. 01.08.2006 నుండి 95 సం॥లు లీజుగా పొందింది) తో 78 సం॥లు రెసిడ్యూల్ లీస్ వ్యవధి మరియు భవనములు మరియు దానిపై ఇతర సివిల్ స్ట్రక్చర్ల నిర్మాణాలతో కలిసి 10 మెగా వాట్ల విద్యుత్ ప్లాంట్ (పనిలో లేవు) కు సంబంధించిన యంత్రాలు మరియు ప్లాంట్.	కంపెనీ సంబంధంగా వెళ్తున్నారు	21 నవంబర్, 2023 న లేదా అంతకుముందు	24 నవంబర్, 2023న ఉ.11.00 గం. నుండి మ.12.00 గం. (*)	900.00	22 నవంబర్, 2023న లేదా ముందు 90 లక్షలు డిపాజిట్ చేయవలెను

1. ఈఎమ్‌డిని బ్యాంక్ ఖాతాలోకి చెల్లింపు ద్వారా లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చు.
2. ప్రారంభ బిడ్ మొత్తం రిజర్వు ధర మరియు ఇంక్రిమెంటల్ బిడ్ కంటే కనీసం ఒక నాచ్ ఎక్కువగా ఉండాలి మొత్తం కనీసం రూ.1,00,000/- లేదా దాని అనేకంగా ఉండాలి.
3. ఇ-వేలం "ఎక్కడ ఉందో అలాగే", "ఏమిటి ఉంది" మరియు "ఏదైనా ఆధారం ప్రాతిపదికన" ద్వారా మాత్రమే నిర్వహించబడుతుంది.
4. ఆసక్తిగల దరఖాస్తుదారులు నిబంధనల వివరాలను కలిగి ఉన్న పూర్తి ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రాన్ని చూడవచ్చు మరియు ఆన్‌లైన్ ఇ-వేలం షరతులు, ఇ-వేలం బిడ్ ఫారం, అర్హత ప్రమాణాలు, బిడ్డర్ ద్వారా డిక్లరేషన్, ఇఎమ్‌డి అవసరం మొదలైనవి సర్వీస్ ప్రొవైడర్ వెబ్ పోర్టల్ అనగా.., https://www.bankauctions.in/ లో లేదా ఇ మెయిల్ kmk123ip@gmail.com ద్వారా అందుబాటులో ఉన్నాయి.
5. ఈ విక్రయానికి సంబంధించి భూమి లీజు రద్దు ఎన్‌సిఎల్ఎటి చెన్నై వద్ద ఎమ్ఐడిసి దాఖలు చేసిన అప్పీలు ఫలితానికి లోబడి ఉంటుంది.
6. లిక్విడేటర్‌కు ఇ-వేలం యొక్క ఏదైనా నిబంధనలు మరియు షరతులను ఆమోదించడానికి లేదా రద్దు చేయడానికి లేదా పొడిగించడానికి లేదా సవరించడానికి హక్కు ఉంటుంది (లేదా) లిక్విడేటర్ ఇ వేలాన్ని రద్దు చేయవచ్చు. ఇంకా అతను ఎటువంటి కారణాలు చూపకుండా అన్నీ లేదా ఏదైనా బిడ్‌లను తిరస్కరించే హక్కును కలిగి ఉన్నాడు.

సం/-
కల్వకొలను మురళీకృష్ణ ప్రసాద్
లిక్విడేటర్
ఐబిబి.రిజి.నం.IBBI/IPA-001/IP-P009672017-8/11588
ఎఎఫ్ఎ 24.11.2023 వరకు చెల్లుతుంది
సంప్రదించాల్సిన నం.98665 12532 /9949551805
ప్రదేశం : హైదరాబాద్
తేది : 23.10.2023

ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్-2016 క్రింద విక్రయ నోటీసు
మెసెర్స్. ఎంపీ షుగర్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ -లిక్విడేషన్‌లో
(సిఐఎన్ : L24110AP1988PLC009291)
నమోదిత కార్యాలయం : అయ్యప్పరెడ్డిపాలెం, నాయుడు పేట మండలం, నెల్లూరు జిల్లా, ఎ.పి.-524126
లిక్విడేటర్స్ చిరునామా : కార్యాలయం నం.58, 3వ క్రాస్, వినాయక నగర్, హెబ్బల్, బెంగళూరు 560024.
మొబైల్ : 9845002523 | 080 2390 2344 ఇ మెయిల్ : plan@psri.in ; ip.empee@gmail.com

ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ కోడ్-2016 క్రింద ఇ-వేలం
ఇ వేలం తేది మరియు సమయం : శుక్రవారం, 24 నవంబర్, 2023 మ.12.30 గం నుండి 02.30 గం. వరకు (ప్రతి 10 నిమిషమల అపరిమితమైన పొడిగింపులతో)
10.02.2023న గౌరవనీయులైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్, అమరావతి బెంచ్ ద్వారా నియమించబడిన లిక్విడేటర్ ద్వారా అందజేసిన ఉత్తర్వుల ద్వారా లిక్విడేషన్ ఎస్టేట్ భాగం ఏర్పడిన లిక్విడేషన్‌లో మెసెర్స్. ఎంపీ షుగర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (కార్పొరేట్ డెబ్టార్) ఆస్తుల విక్రయం. "ఆధారం ఎక్కడ ఉందో అలాగే", "ఆధారం ఉన్నట్లే", "ఏదైనా ఆధారం" మరియు "ఏ ఆధారం లేకుండా" ద్వారా ఇ-వేలం ప్లాట్ ఫారమ్ నేషనల్ ఇ-గవర్నెన్స్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్ఇఎస్ఎల్) అందించిన లింక్ https://nesl.co.in/auction-notices-under-ibc/ వద్ద దిగువసంతకందారు ద్వారా విక్రయం జరుగుతుంది.

బ్లాక్	అసెట్స్ వివరాలు	రిజర్వు ధర (కోట్లు రూ.లో)	ఇఎమ్‌డి మొత్తం (కోట్లు రూ.లో)	బిడ్ ఇంక్రిమెంటల్ విలువ (కోట్లు రూ.లో)
1	భూమితో కూడిన అంబ సముద్రం యూనిట్ అమ్మకం (సుమారు 202 ఎకరాలు) మరియు ముక్కూదల్ గ్రామం, అంబసముద్రం, తిరునెల్వేల్లి గ్రామం, తమిళనాడు వద్ద ఉన్న భవనాలు. పైన పేర్కొన్న ఆస్తులను పొందే ఎంపికతో కంపెనీలో భాగంగా గోయింగ్ కన్సర్న్ (ఇతర ఆస్తులు కొన్ని అర్హతలు మరియు చర్య తీసుకోదగిన దావా, ప్రక్రియలో అందుబాటులో ఉన్న వివరాలు మెమోరాండం)	20.00	2.00	0.10

ముఖ్యమైన గమనికలు :
1. తనిఖీ తేది : 09 నవంబర్, 2023 నుండి 18 నవంబర్, 2023
2. ఇ-వేలం "ఎక్కడ ఉందో అలాగే", "ఏమిటి ఉంది" మరియు "ఏదైనా ఆధారం ప్రాతిపదికన" ద్వారా మాత్రమే నిర్వహించబడుతుంది.
3. విక్రయాన్ని అమలు చేయడానికి లిక్విడేటర్ లేదా కంపెనీ విధిగా పాటించవలసిన బాధ్యత ఈ ఆహ్వానం కాబోయే బిడ్డర్లను ఆహ్వానించడానికి ఉద్దేశించబడింది మరియు ఏ రకమైన వాటిని సృష్టించదని స్పష్టం చేయబడింది. లిక్విడేటర్‌కు ఇ-వేలం యొక్క ఏదైనా నిబంధనలు మరియు షరతులను ఆమోదించడానికి లేదా రద్దు చేయడానికి/ పొడిగించడానికి/ సవరించడానికి హక్కు ఉంటుంది లిక్విడేటర్ ఇ వేలాన్ని రద్దు చేయవచ్చు. అతను ఎటువంటి కారణాలు చూపకుండా ముందస్తు నోటీసు లేకుండా అన్నీ లేదా ఏదైనా బిడ్‌లను లేదా వేలం యొక్క దశలను తిరస్కరించే హక్కును కలిగి ఉన్నాడు.
4. అన్ని నిబంధనలు మరియు షరతులు తప్పనిసరిగా ఇ-వేలం ప్రక్రియ సమాచార డాక్యుమెంట్ ఇఎమ్‌డి మరియు భాగస్వామ్య ప్రక్రియను సమర్పించడానికి ముందు నుండి సూచించబడాలి. పూర్తి ఇ-వేలం ఆన్‌లైన్ బిడ్ యొక్క ఆస్తులు, నిబంధనలు మరియు షరతుల వివరాలను కలిగి ఉన్న ప్రక్రియ సమాచార పత్రం వేలం, ఇఎమ్‌డి ఫారం, అర్హత ప్రమాణాలు, బిడ్డర్ల ద్వారా ప్రకటన, ఇఎమ్‌డి అవసరాలు మొదలైనవి https://nesl.co.in/auction-notices-under-ibc/ మరియు www.psri.in/escl/ అందుబాటులో ఉన్నాయి.
5. కార్పొరేట్ డెబ్టార్ యొక్క అంబసముద్రం యూనిట్‌ను విక్రయించడానికి లేదా కార్పొరేట్‌ను విక్రయించడానికి సూచనతో అంబసముద్రం యూనిట్‌తో సహా ఆందోళనకు దిగుతున్న వాటాదారుల సంప్రదింపుల కమిటీతో సంప్రదించి లిక్విడేటర్ సంపూర్ణ హక్కును కలిగి ఉంటాడు. తదుపరి స్పష్టత కొరకు ఇ వేలం సమాచార పత్రాన్ని దయచేసి చూడండి.
6. బిడ్ సంబంధిత పత్రాలు సూచించిన ఫార్మాట్లలో ఇ-మెయిల్ ద్వారా సమర్పించబడతాయి మరియు అసలైన హార్డు కాపీలు లిక్విడేటర్ కార్యాలయానికి పంపబడతాయి.
7. ఉద్దేశించిన బిడ్డర్లు, వారి బిడ్‌ను సమర్పించే ముందు, ఆస్తి టైటిల్, స్థానిక పన్నుల బకాయిలు, విద్యుత్ మరియు నీటి ఛార్జీలు, నిర్వహణకు సంబంధించి ఛార్జీలు, ఏదైనా ఉంటే వారి స్వతంత్ర విచారణలు చేయాలి మరియు వారి స్వంత ఖర్చులతో ఆస్తిని తనిఖీ చేసి తమను తాము సంతృప్తి పరచుకోవాలి.
8. అన్నీ బిడ్ డాక్యుమెంట్లతో పాటు ఇఓఐ, రీఫండబుల్ పార్టిసిపేషన్ డిపాజిట్ డబ్బును సమర్పించే చివరి తేది : 06.11.2023
9. ఇఎమ్‌డి సమర్పణకు చివరి తేది : 22.11.2023న లేదా అంతకు ముందు.
10. ఇ వేలం తేది మరియు సమయం : 24.11.2023, మ.12.30 గం. నుండి 2.30 గం. వరకు ప్రతిసారి 10 నిమిషముల అపరిమితమైన పొడిగింపుతో.
11. ఇఎమ్‌డి డిపాజిట్ చేసిన ఆసక్తి గల దరఖాస్తుదారులు మరియు లాగిన్ ఐడి మరియు పాస్వర్డ్ సహాయం అవసరమైతే లిక్విడేటర్ కార్యాలయంలో 080-2390 2344 లేదా ఇ మెయిల్ ip.empee@gmail.com లేదా plan@psri.in ద్వారా సంప్రదించవచ్చు.

పంకజ్ శ్రీవాస్తవ
లిక్విడేటర్-ఎంపీ షుగర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్
ఆఫీసు నం.58, 3వ క్రాస్, వినాయక నగర్, హెబ్బల్, బెంగళూరు-560024
ఐబిబి.రిజి.నం.IBBI/IPA-001/IP-P00245 /2017-18/10474
ఎఎఫ్ఎ 23.11.2023 వరకు చెల్లుతుంది
తేది : సోమవారం, 23 అక్టోబర్, 2023
ప్రదేశం : బెంగళూరు
సంప్రదించాల్సిన నం.080 2390 2344, ip.empee@gmail.com psri@live.com ; www.psri.in/escl/

పప్పు బెల్లాల పండుగ

రేపటి నుంచి పిల్లలకు దసరా సెలవులు ఇస్తున్నారు. పిల్లలందరి ముఖాల్లో ఆనందం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ అయ్యాక ప్రధానోపాధ్యాయుడు పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. 'పిల్లలూ! మీకు తెలియని ఒకప్పటి అంటే నా చిన్నప్పటి దసరా పండుగ గురించి చెప్పాలనుకుంటున్నాను. వింటారా?' అన్నారు హెచ్‌ఎం.

'చెప్పండి సర్' అన్నారు పిల్లలంతా ఒక్కసారిగా. 'మా చిన్నప్పుడు దసరా పండుగను గిలకల పండుగ అనేవారు. మా బడి పంతుళ్ల వెనుక నడుస్తుంటే మేమంతా వెదురుతో చేసిన విల్లంబులు, విల్లు చివరి భాగంలో కొందరు మిఠాయి పొట్లం ఆకారంలో బుక్కా పొడి, మరి కొందరు పువ్వులు పెట్టుకుని ముందు నడిచేవాళ్ళం. ప్రతి ఇంటి ముందు ఆగి బాణాలు వేస్తూ పాటలు పాడేవాళ్ళం.

ఏదయా మీ దయ మా మీద లేదు...
ఇంత సేపుంచుట ఇది మీకు తగదు
అయ్యవారికి చాలు ఐదు వరహాలు
పిల్లవాళ్లకు చాలు పప్పు బెల్లాలు
శీఘ్రముగ పంపరే శ్రీమంతులారా
జయీభవ విజయీభవా దిగ్విజయీభవా!

అని పాట పాడుతూ పెద్దలందరి నుండి మామూళ్లు తీసుకునే వాళ్ళం' అన్నారు హెచ్‌ఎం.

'సర్! ఇప్పుడు కూడా దసరా మామూళ్లు అడుగుతారు కదండీ! అలా అప్పుడు మీరు అడిగేవారా?' అంది ఒక బాలిక.

'ఒక వ్యక్తి అభివృద్ధి కానీ, కుటుంబం, సమాజం, ప్రాంతం అభివృద్ధి కానీ చదువుతోటే సాధ్యమవుతుంది. అందుకని బడి బాగుండాలని బడికి, విద్య నేర్పే గురువులకు ఊరి ప్రజలు దసరా మామూళ్ల రూపంలో కొంత మొత్తం ఇచ్చేవారు. పిల్లలకు బలం రావడానికి పప్పు బెల్లాలు ఇచ్చేవారు. మేం సంవత్సరకాలంలో నేర్చుకున్న పద్యాలు, శ్లోకాలు, పొడుపు కథలు, గణిత సమస్యలు జ్ఞాన ప్రదర్శన చేసి పెద్దలను మెప్పించి కానుకలు పొందేవాళ్ళం. కాలక్రమేణా ఇది అన్ని వర్గాల వారికి దసరా పండుగ అంటే మామూళ్ల పండుగగా మారిపోయింది' అని నవ్వుతూ అన్నారు హెచ్‌ఎం.

'మీరు పాడిన పాటలో ఇంత గొప్ప అర్థం ఉందా సర్?" అన్నాడు ఒక బాలుడు. 'అవును, అప్పటి ఉపాధ్యాయులు తాము వెలుగుతూ, పిల్లలను వెలిగే దివ్వెలుగా మార్చేవారు. ఇప్పుడు ఆ పాట అవసరం లేదు మీరంతా బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి' అని ముగించారు హెచ్‌ఎం.

– కె.వి.సుమలత,
94926 56255

సరైన పదాలు రాయండి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మల ఆంగ్ల పదాలు గళ్లల్లో ఇచ్చిన అక్షరాలతో కలిసిఉంటాయి. ఏ గడిలో ఏ బొమ్మ పదం వస్తుందో సరైన అక్షరాలు మీరు రాయండి.

నేను గీసిన బొమ్మ

కె.భువనేశ్వరి
పదవ తరగతి
జక్కాపూర్, సిద్ధిపేట జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అప్పుడే ఆమెకు జయజయ ధ్వానాలు...

JEEVANA

జీవన the family

దసరా నవరాత్రులు మొదలవగానే - అమ్మ వారిని స్తుతించే గీతాలూ, గానాలూ హోరెత్తిపోతాయి. పలు వేదికలపై మహిళాశక్తిని మహత్తర శక్తిగా ప్రస్తుతించే ప్రవచనాలు ఉధృతంగా ప్రవహిస్తాయి. అమ్మ వారిని రోజుకొక అలంకరణలో ప్రదర్శిస్తూ, ఆ అలంకరణకు ఉన్న ప్రాధాన్యాన్ని, ప్రాశస్త్యాన్ని వివరించటం ప్రతి ఏటా విజయదశమి సందర్భంగా ఆనవాయితీగా నడుస్తోంది. దుష్టత్వాన్ని దునుమాడే మహా బలశాలిగా మహిళకు మంగళారతులు, జేజేల గానామృతాలూ సమర్పించటం... దసరా వేళల్లో మనకు ఒక మామూలు సంప్రదాయంగా సాగుతోంది.

కొన్ని తరాలుగా జరుగుతున్న ఈ పండగలోని పరమార్థం అందరికీ నిజంగానే వంటబడితే– వర్తమానం ఇలా ఉంటుందా? పూజల్లో అమ్మను స్తుతించటం, వ్యవహారంలో ఆ అమ్మనే అవమానించే తిట్ల దండకాలను అందుకోవడం సమాజంలో ఒక పరిపాటిగా కనిపిస్తోంది. ఒకపక్క స్త్రీల గురించి ఘనంగా కీర్తిస్తూనే– అదే స్త్రీలను ఇంటికీ, వంటకీ పరిమితం చేసే సూత్రాలను వల్లించటం చెల్లుబాటుగా సాగిపోతోంది. దాయాదుల మధ్య వివాదంలోనైనా, దేశాల మధ్య యుద్ధ సందర్భంలోనైనా 'మహిళ' ఒక కక్షపూరిత లక్ష్యమవుతుంది. ఆమెను అవమానించటం, అపహరించటం, హత్యాచారాలకు గురిచేయడం – ఆధిపత్యం చెలాయించాలనుకునే వారికి ఒక అలవాటుగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితికి మూల కారణం ఏమిటి? దానిని పసికట్టి, పనిగట్టుకొని నిర్మూలించినప్పుడే కదా, జయజయ మహిషాసుర మర్దని అన్న మాటకు నిజమైన అర్థం చేకూరుతుంది.

ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి కుటుంబ అవసరాల కోసం కానిస్టేబులు ఉద్యోగంలో చేరింది. ఆ ఉద్యోగం కోసమే ఆమె వ్యాయామ శిక్షణ పొందిందని, ఆ శిక్షణ ఇచ్చిన ప్రేమికుడికి తెలుసు. తీరా ఆమె ఉద్యోగంలో చేరాక పరిస్థితి మారిపోయింది. తగిన సమయంలో కుటుంబానికి కేటాయించటం లేదని భర్తగా అతడు ఆమెతో గొడవ పడ్డాడు. కలవటానికి అని ఇద్దరూ ఓ హోటలు గదికి చేరారు. మళ్లీ మాటా మాటా పెరిగింది. తుపాకీ తీసి నిర్దాక్షిణ్యంగా ఆమెను కాల్చేసి, అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆపదలో ఉండే ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన ఉద్యోగ విధి ఆమెది. కానీ, తనను తాను కాపాడుకోలేక పోయింది.. ఇది జరిగింది నిన్నగాక మొన్న బీహార్ రాజధాని పాట్నాలో.

కొన్ని నెలల క్రితం మణిపూర్‌లో జరిగిన ఘోరం ప్రపంచం మొత్తానికి తెలుసు. మైతీ అనే తెగకు చెందిన గుంపు – కుకీ తెగకు చెందిన మహిళలపై ఉన్మాదంతో విరుచుకుపడింది. వారిని వివస్త్రలను చేసి, రెండు మూడు కిలోమీటర్ల దూరం ఊరేగింపుగా నడిపించారు. అత్యంత అమానవీయంగా, జుగుప్సాకరంగా ప్రవర్తించారు. అత్యాచారానికి పాల్పడ్డారు. ఇలాంటి అమానవీయ సంఘటనలు అక్కడ ఎన్నో జరిగాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించాడు. గుజరాత్‌లో బిల్కీస్ బానో తదితర మహిళల విషయంలోనూ ఇలాగే జరిగింది. ఇప్పుడు ఇజ్రాయేల్ దాడుల తరుణంలోనూ ఇదే జరుగుతోంది.

ఒక మనిషికి మరో మనిషికీ విభేదం వచ్చినా, ఒక కుటుంబం మరో కుటుంబం మధ్య వివాదం తలెత్తినా, ఒక మతానికి మరో మతం మీద విద్వేషం చెలరేగినా, ఒక దేశం మీద ఇంకో దేశానికి ప్రతీకారం పేట్రేగినా– తొట్ట తొలి బాధితులు మహిళలు అవుతున్నారు. మనల్ని ఘనంగా పాలించారు అని చెప్పే రాజులూ, పురాణ పురుషులూ ఇదే చేశారు. ఆధునిక నాగరిక సమాజంలోనూ ఇలాగే కొనసాగుతోంది.

ఎందుకిలా జరుగుతోంది?

కాలాలూ, పాలనా వ్యవస్థలూ ఎన్ని మారినా వ్యవస్థీకృతమైన భావజాల దృక్పథం మారకపోవడం దీనికి ప్రథమ కారణం. ఆధునిక మానవుడిని సైతం పురాతన కాలపు మతమూ, అది ప్రతిపాదించిన విలువలే నడిపిస్తున్నాయి. మహిళల ఘనతల గురించి ఘనంగా చెప్పే మతం– వారు ఏ వయసులో స్త్రీ ఎవరి రక్షణలో ఉండాలో శ్లోకాలను ఏకరువు పెడుతుంది. మహిళలు ఏఏ విలువలను ఎలా పాటించాలో నిర్దేశిస్తుంది. మగవాళ్లకు విలువలకు సంబంధించిన విధి విధానాలు ప్రత్యేకంగా ఉండవు. ఆధునికంగా మారిన, మారుతున్న సమాజాన్ని పురాతన మత దృక్కోణ ఛట్రంలో బిగించి ఉంచడం ఏ దేశంలో అయినా మతాచారాలు చేసే పని.

మహిళలను అణగదొక్కే భావాలను మగాళ్లు మాత్రమే అమలు చేయరు. ఈ సమాజంలో చేత రూపొందింపబడిన మహిళలు, ఇతర బాధితులు సైతం భాగస్వాములు అవుతారు. ఒక రాజకీయ నాయకుడిని తక్కువ చేసి, అవమానించటానికి ఒక రాజకీయ పార్టీ నాయకురాలు అతడికి 'గాజులు' పార్సిలు చేసి పంపుతానని చెబుతుంది. మరొక పార్టీ మహిళానేత మరొక సందర్భంలో తమ ప్రత్యర్థి నాయకుడికి 'చీరలు' పంపిస్తానని ఎకసెక్కాలాడుతుంది. ఈ రెండు సందర్భాల్లోనూ సదరు నాయకుడు శక్తిహీనుడని చెప్పటం వారి ఉద్దేశం. గాజులు, చీరలు ధరించటం అబలత్వానికి చిహ్నం అని వారి మాటల పరమార్థం. తమకు తామే అవమానించుకుంటున్నామని గ్రహించలేనంత భావజాల బానిసత్వంలో ఆ మహిళా నేతలు ఇద్దరూ ఉన్నారు. వారే కాదు, అత్యధికులు ఇలాగే ఉంటారు.

సూర్యరాయాంధ్ర నిఘంటువులో స్త్రీ అనే మాటకు 300 వరకూ పర్యాయ పదాలు ఉన్నాయి. అందులో అత్యధిక పదాలు స్త్రీల అందాన్నో, సౌకుమార్యాన్నో సూచించేవిగా ఉంటాయి. మన పురాణ కథల్లో, ప్రబంధగాథల్లో, సినిమాల్లో ... అన్నిటా దాదాపుగా ఇదే ఒరవడి. అందమూ, అలంకరణా, అణుకువా, అజ్ఞానమూ, పురుషుడే లోకంగా బతికేసే గుణమూ మహిళలకు అనుసరణీయాలు అవుతాయి. వాటిని దాటి సొంత వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే అవసరాన్ని, అవకాశాన్ని మన ఆధిపత్య సమాజం వారికి ఇవ్వదు.

అలా అని అణచివేత భావాలదే పై చేయిగా ఈ సమాజం నడిచిపోదు. వాటి నుంచి విడువడుతూ, మార్పు దిశగా ఏ కాలంలోనైనా గట్టి ప్రయత్నం జరుగుతూనే ఉంటుంది. ఉన్నది ఉన్నట్టుగా అలాగే ఉండి తీరాలీ అన్న సనాతన భావం ఆరచణలో నిలబడదు. అలా నిలబడితే మన రోజువారీ జీవనం ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. ఆచరణతో కూడిన ఆధునికత జయిస్తున్నది కనుకనే సమాజం ముందుకు నడుస్తోంది. భావజాలంలోనూ అలాంటి మార్పు నిరంతరంగా రావాలి. పాత దానిని పట్టుకు వేలాడే రాజీగుణం, అదే గొప్పది అని చెప్పే పటాటోపం ఉన్నంత కాలం ఆధునిక జీవితంలో గందరగోళం కొనసాగుతుంది. అది ఆధిపత్యవాదులకు బలంగానూ; మహిళలకు, ఇతర బాధితులకు అణచివేతగానూ, అదనపు భారంగానూ దాపురిస్తుంది.

ఈ స్థితిని, ఈ భావజాల బరువునీ ఇలాగే ఉంచుకొని – మహిళల అభివృద్ధి గురించి, బలసంపన్నత గురించీ మాట్లాడుకోవడం సమాజ ద్వంద్వ విలువలను సూచిస్తోంది. అందుకనే ఒక పక్క పూజల్లో, పురాణాల్లో, ప్రసంగాల్లో వినిపించే మహిళాభ్యుదయం ఆచరణలో పూర్తిగా కనిపించటం లేదు. పూజల మాటెలా ఉన్నా– తొలుత స్త్రీలను సొంత ఆలోచన, అభిప్రాయమూ, వ్యక్తిత్వమూ ఉన్న మనుషులుగా గుర్తిస్తే – ఎంతో అభ్యుదయం సాధ్యమవుతుంది. ప్రబంధాల సౌందర్యంగానో, మార్కెట్టు సరుకుగానో కాదు; మనిషిగా ఉనికినివ్వాలి మొదట. అప్పుడే ఎల్లెడలా మహిళాశక్తికి జయ జయ ధ్వానాల పల్లవుల పాట!

– శాంతిమిత్ర

దసరా సినిమా సందడి

దసరా వచ్చిందంటే చాలు, ఒకపక్క పండగ హడావిడి, మరోపక్క సినిమా సందడి ఉండనే ఉంటుంది. ఈసారి పండక్కి కూడా బడా హీరోలు బాక్సాఫీసు బరిలో పోటీపడ్డారు. బాలకృష్ణ, రవితేజ, విజయ్ వరుసగా నటించిన 'భగవంత్ కేసరి', 'టైగర్ నాగేశ్వరరావు', 'లియో' సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. యాక్షన్, సెంటిమెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ కలయికతో వచ్చిన ఈ సినిమాలు ఎలా ఉన్నాయో క్లుప్తంగా చూద్దాం..

భగవంత్ కేసరి

బాలకృష్ణ అంటేనే యాక్షన్ సినిమాలకు పెట్టిందిపేరు. కొంతకాలంగా ఆయన సినిమాల్లో అదే కనిపిస్తోంది మరి. ఊచకోత, హింస, రక్తపాతం ఒకదాన్ని మించి ఒకటి పోటీపడుతూ ఉంటాయి. అయితే ఈసారి దర్శకుడు అనిల్ రావిపూడి బాలకృష్ణతో సినిమా ప్రకటించగానే ఆయన అభిమానులందరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాల్లో అందెవేసిన చేయిగా అనిల్‌కి పేరుంది. అలాంటి దర్శకుడు యాక్షన్ హీరో బాలకృష్ణను తెరపై ఎలా చూపిస్తాడోనని చాలామంది ఎదురుచూశారు. అయితే అభిమానులను ఎంతమాత్రం నిరాశపర్చకుండా ఒకపక్క యాక్షన్ చూపిస్తూనే, మరోపక్క సమాజానికి మంచి సందేశం ఇచ్చే సన్నివేశాలతో ఈ సినిమా ఉంది. బాలకృష్ణ తండ్రిపాత్రలో మెప్పించారు. కూతురు పాత్రలో నటించిన శ్రీలీలకు కూడా మంచి మార్కులే పడ్డాయి. 'ఆడపిల్లను సింహంలా పెంచాలి', 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలకృష్ణ స్కూలులో చెప్పే వివరణ'పై ఇప్పుడు ఎక్కడ చూసినా చర్చ నడుస్తోంది. స్నేహితుని కూతురును ఉన్నత లక్ష్యం వైపు నడిపించే తీరు, భగవంత్ కేసరి ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయి. బాలకృష్ణ సినిమాలన్నీ ఆయన ఒంటిచేత్తో నడిపిస్తారు. ఫైట్లు, పాటలు ఆయన కోసమే అన్నట్లు ఉంటాయి. కానీ ఈ సినిమాలో బాలకృష్ణతో పోటీపడి శ్రీలీల నటించింది. ఒక సీనియర్ హీరో పక్కన నటనకు ఆస్కారమున్న పాత్రలో మెప్పించింది. అంతేకాక క్లైమాక్స్‌లో ఆమెతో చేయించిన పోరాట సన్నివేశం అందరినీ అలరిస్తుంది. కథ, కథనం, తెరకెక్కించిన విధానం బట్టే సినిమా విజయం ఆధారపడి ఉంటుంది. కమర్షియల్ సినిమాల్లో, పెద్ద హీరోల సినిమాల్లో సమాజాన్ని చైతన్యం చేసే సందేశాలు ఈ మధ్య అప్పుడప్పుడూ కనిపిస్తున్నా ఈ సినిమాలో అనిల్ స్పృశించిన అంశాలు మాత్రం ఎవర్‌గ్రీన్‌గా నిలిచాయి.



టైగర్ నాగేశ్వరావు

అగ్రహీరోల హవా నడుస్తున్నా రవితేజ సినిమాలకు మాత్రం పక్కా గ్యారంటీ అభిమానులు ఉంటారు. తన సినీ కెరియర్‌లో తొలిసారి రవితేజ ఓ బయోపిక్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. లక్ష్మీ మంచు 'దొంగాట', రాజ్ తరుణ్ 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' వంటి చిన్న సినిమాలతో ఇండస్ట్రీలో మంచి పేరు తెచ్చుకున్న వంశీ స్టువర్టుపురం దొంగ నాగేశ్వరరావు జీవితకథ మొదట బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కి వినిపించినా డేట్స్ కుదరక రవితేజ దగ్గర లాక్ అయ్యింది. 1970 నాటి మోస్ట్ వాంటెడ్ దొంగైన స్టువర్టుపురం నాగేశ్వరరావుపై చాలాకాలం స్టడీ చేసి ఈ సినిమా తెరకెక్కించానని వంశీ పలు ఇంటర్వ్యూలో చెప్పారు. రేణుదేశాయ్ వంటి సీనియర్ హీరోయిన్‌తో హేమలతా లవణం వంటి సామాజిక కార్యకర్త పాత్ర చేయించామని చెప్పారు. నాగేశ్వరరావు దొంగలా ఎలా మారాడు? ఎంత చాకచక్యంగా దొంగతనాలు చేసేవాడు? చెప్పి దొంగతనం చేయడంలో నేర్పరి, తన ఊరు, జనాల కోసం ఆయన పడే తపన తెరమీద చూపించాలనే ఈ సినిమా తీశానని వంశీ చాలా సందర్భాల్లో చెప్పుకొచ్చారు. అయితే వెండితెరపై అవేమీ కనిపించలేదననే విమర్శ ఉంది. రేణుదేశాయ్ పాత్ర నిడివి తక్కువ. సినిమాలో ఆమె ప్రభావం ఏం లేదు. నాగేశ్వరరావు దొంగతనాలు చాలా చాకచక్యంగా చేసేవాడని చెప్పుకొచ్చినా వాటిని తెరకెక్కించడంలో దర్శకుడు పూర్తిగా తడబడ్డాడు. జనాలకు మంచి చేసే దొంగగా నాగేశ్వరావును చూపించే ప్రయత్నం చేసినా ఆ సన్నివేశాలేమీ పెద్దగా అలరించవు. రవితేజ మంచి ఈజ్ ఉన్న నటుడు. ఏ పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోతాడు. తన పాత్ర వరకు రవితేజ న్యాయం చేసినట్లే. కానీ కథనం కాస్త గాడి తప్పింది. పతాక సన్నివేశాలు కూడా సో సో గా సాగుతాయి. సినిమా నిడివి కూడా ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది. ఎడిటింగ్ వర్క్ ఇంకొంచెం బెటర్ అయితే బాగుండేది.

లియో

తమిళ నటుడు విజయ్‌కి తెలుగులో కూడా అభిమానులు ఉన్నారు. లోకేష్ కనగరాజ్‌కి కూడా ప్రత్యేక ఫాన్ బేస్ ఉంది. హీరో ఎలివేషన్, యాక్షన్ సన్నివేశాలకు లోకేష్ పెట్టింది పేరు. సినిమా ఆరంభంలో మొదటి 15 నిమిషాలు అసలు మిస్ కాకండి అంటూ లోకేష్ ఇచ్చిన మెసేజ్‌కి తగ్గట్లుగానే హైనాతో విజయ్ పోరాటం మెప్పిస్తుంది. యాక్షన్‌తో పాటు ఈసారి ఒకింత సెంటిమెంట్ కూడా టచ్ చేశాడు దర్శకుడు. 'ఖైదీ', 'విక్రమ్' మాదిరి లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌సియు)లో భాగంగానే 'లియో' తెరకెక్కిందని అందరూ భావించారు. మొదటి రెండు సినిమాల్లో మాదిరి క్లైమాక్స్ సన్నివేశంలో కమల్ కామియో పాత్రలో కనిపిస్తారు. అయితే ఆ సినిమాలకు వచ్చిన పాజిటివ్ టాక్ ఈ పాత్రకు రాలేదు. సంజయ్‌దత్, అర్జున్, త్రిష పాత్రలు ప్రేక్షకులను బాగా అలరిస్తాయి. లియోగా యాక్షన్ సన్నివేశాల్లో, ఓ బిడ్డ తండ్రిగా పార్తీబన్ పాత్రలో విజయ్ నటన బాగుంది. లోకేష్, విజయ్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బాగానే వసూళ్లు రాబడుతోంది.

వరి ఎండుతోందని ఉరితాళ్లతో
రైతుల నిరసన

ప్రజాశక్తి–బాపట్ల

సాగునీరు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయని రైతులు పొలంలోనే ఉరితాళ్లతో నిరసన తెలిపారు. బాపట్ల మండలం, మురుకొండపాడు గ్రామ శివారులో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ సాగునీరు లేక కళ్లెదుటే ఎండిపోతున్న పంటను కాపాడుకోలేని దైన్య స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులు పట్టించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని, పంటను కాపాడుకోవడం కోసం అష్టకష్టాలు పడుతున్నామన్నారు. సాగునీరు అందకపోవడంతో ఈ ఏడాది పంట చేతికి వస్తుందో, లేదోనని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లగా వైసిపి ప్రభుత్వం కాలంలో కాల్వల మరమ్మతులకు నోచుకోలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు.

ఉరి తాళ్లతో రైతన్నలు...

గ్రూప్‌1, 2 పరీక్షలపై 27న అవగాహన సదస్సు

- బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

గ్రూప్‌1, 2 పరీక్షలపై పూలే అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 27న అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను సిసిఎల్‌ఎ సెక్రటరీ ఎండి ఇంతియాజ్, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి సంపత్ కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. విజయవాడలోని సిద్ధార్థ ఐఏఎస్ అకాడమిలో 27న సాయంత్రం 5 గంటలకు ఈ అవగాహన సదస్సును నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇంతియాజ్, సంపత్ కుమార్ మాట్లాడుతూ గ్రూప్‌1, 2 పరీక్షల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీయువకులందరూ వినియోగించుకోవాలని కోరారు. నిర్వహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరపు కళాసమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆంధ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. గ్రూప్ 1, 2 నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కివీస్‌ను కుమ్మేశారు

- నాలుగు వికెట్లతో భారత్ గెలుపు
- కోహ్లి శతకం మిస్, రోహిత్, జడేజా మెరుపులు • ప్రపంచకప్ 2023

ధర్మశాల: స్వదేశంలో జరుగుతున్న ప్రపంచకప్‌లో భారత్ జైత్రయాత్ర సాగుతోంది. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో ఘనవిజయం విజయం సాధించి వరుసగా ఐదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. కివీస్ నిర్దేశించిన 274 పరుగుల లక్ష్యాన్ని భారత్ ఆరు వికెట్లు కోల్పోయి, ఇంకా రెండు ఓవర్లు మిగిలుండగానే ఛేదించింది. విరాట్ కోహ్లి (95, 104 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. రవీంద్ర జడేజా (39, 44 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తోడు, అంతకు ముందు రోహిత్ శర్మ (46, 40 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించడం భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాయి. 2003 ప్రపంచకప్ తరువాత న్యజిలాండ్‌పై భారత్ గెలవడం ఇదే మొదటిసారి. అలాగే 2019 కప్‌లో సెమీస్‌లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకున్నట్లయింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో 10 పాయింట్లతో అగ్రస్థానంలో చేరుకుంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన న్యూజిలాండ్.. నిర్ణీత 50 ఓవర్లలో 273 పరుగులకు ఆలౌట్ అయింది. డారిల్ మిచెల్ (130, 127 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకం బాదాడు. రచిన్ రవీంద్ర (75, 87 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) కూడా భారీ ఇన్నింగ్స్ ఆడాడు. షమి ఐదు వికెట్లతో అదరగొట్టగా.. కుల్‌దీప్ యాదవ్ రెండు, బుమ్రా, సిరాజ్‌లకు చెరో వికెట్ దక్కింది.

లక్ష్య సాధనలో రోహిత్– శుభ్‌మన్ గిల్ (26) జోడీ ధాటిగానే ఆడింది. అయితే జట్టు స్కోరు రోహిత్ 71 తొలి వికెట్‌గా నిష్క్రమించాడు. 76 పరుగులు వద్ద గిల్ అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌తో వన్డేల్లో వేగంగా 2 వేలు పరుగులు (38 ఇన్నింగ్స్‌లు) చేసిన ఆటగాడిగా గిల్ అవతరించాడు. ఒక వైపు కోహ్లి పరుగులు చేస్తున్నా మరోవైపు శ్రేయస్ అయ్యర్ (33), కేఎల్ రాహుల్ (27) భారీ స్కోర్లు చేయలేకపోయారు. సూర్యకుమార్ యాదవ్ (2) ఘోరంగా విఫలమయ్యాడు. 191 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ భారత్‌ను కోహ్లి, జడేజా జోడి ఆదుకుంది. అయితే 269 వద్ద కోహ్లి అవుటయ్యాడు. తరువాత షమీ (1)తో కలిసి జడేజా ఆట పూర్తి చేశాడు.. కివీస్ బౌలర్లలో ఫెర్గ్యూసన్ 2, ట్రెంట్ బౌల్ట్, మిచెల్ శాంట్నర్, మ్యాట్ హెన్రీ తలో వికెట్ పడగొట్టారు.

ప్లేయర్ ఆఫ్ మ్యాచ్ షమి

ఈ ప్రపంచకప్‌లో తొలి నాలుగు మ్యాచులకు బెంచ్‌కు పరిమితమైన మహ్మద్ షమి.. అవకాశం దక్కిన ధర్మశాలలో దుమ్మురేపాడు.

న్యూజిలాండ్‌పై ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన షమి (5/54) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. షమి 2019 ప్రపంచకప్‌లోనూ ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ప్రపంచకప్‌ల్లో మొత్తంగా భారత బౌలర్లకు ఇది తొమ్మిదో ఐదు వికెట్ల ప్రదర్శన.

ప్రపంచకప్‌లో నేడు	ప్రపంచకప్‌లో రేపు
అఫ్ఘనిస్థాన్ × పాకిస్థాన్	బంగ్లాదేశ్ × దక్షిణాఫ్రికా
వేదిక : చెన్నై	వేదిక : ముంబయి

సమయం : మ|| 2 నుంచి

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

సత్యమేవ జయతే
దుష్టశిక్షణలోన దేవి శాంభవి... శిష్టరక్షణకై వెలసిన ఆపద్బాంధవి...
పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, నాయకులకు,
కార్యకర్తలకు, ప్రజలందరికి శ్రీ కనక దుర్గమ్మ కరుణాకటాక్షాలతో
ఆనంద ఆరోగ్యదాయకంగా వుండాలని ఆశిస్తూ
విజయ దశమి శుభాకాంక్షలు
జయదేవ్ గల్లా,
గుంటూరు పార్లమెంట్ సభ్యులు
jayadev.galla jaygalla jayadev.galla jayadevgalla

దసరా శుభాకాంక్షలతో...
అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల పెద్దమ్మ సురారులమ్మ కడుపారడి పుచ్చినయమ్మ,
దన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ, దుర్గమాయమ్మ కృతాబ్ధి యిచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్
సోనోవిజన్ దసరా సేల్
అతి తక్కువ ధరలు Lowest Prices GUARANTEED Best Service నమ్మకమైన సర్వీస్
మీరెంతగానో
అభిమానించి, ఆదరించిన
స్క్రాచ్ కార్డ్ స్కీమ్ మళ్ళీ ప్రారంభం
ప్రతి ₹2000/- కొనుగోలుతో స్క్రాచ్ కార్డ్ పొందండి
₹100/- నుండి ₹1,00,000/-
వరకు తక్షణ నగదు బహుమతి అందుకోండి (సెలక్టెడ్ మోడల్స్‌పై)
స్క్రాచ్ కార్డ్ పెద్ద మొత్తంలో గెలుచుకొన్న కొనుగోలుదారులలో కొంత మంది, అందరికి అభినందనలు
రూ. 1,00,000/- విజేత
ఆర్. జె. ఎంటర్‌ప్రైజెస్
విశాఖపట్నం. 9154333337
రూ. 1,00,000/- విజేత
శ్రీ దశరధ రామిరెడ్డి గారు
హైదరాబాద్. 8074639005
రూ. 1,00,000/- విజేత
శ్రీ సజ్జా రాజేష్ గారు
విజయవాడ. 9603317799
రూ. 1,00,000/- విజేత
శ్రీమతి జి. దివ్య లక్ష్మి గారు
అనంతపురం. 9121275607
రూ. 1,00,000/- విజేత
శ్రీ వై. తిరుపతి రావు గారు
ఖమ్మం. 8639666192
రూ. 1,00,000/- విజేత
శ్రీ పి. ధన కుమార్ గారు
నెల్లూరు. 9849011817
రూ. 1,00,000/- విజేత
శ్రీమతి కె. అనురాధ గారు
విజయవాడ. 9866646924
రూ. 1,00,000/- విజేత
జి.కె. బ్లాక్ క్యాట్ సర్వీసెస్
విశాఖపట్నం-2. 9885511888
రూ. 1,00,000/- విజేత
శ్రీ పి. ప్రసాద్ గారు
విశాఖపట్నం - 1. 9966360434
Visit Our Website www.sonovision.in (Our Team Members are Waiting to Serve You Online & Offline)
విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202
విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.
విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9246666664, 9100991701, 9440804184
విజయవాడ, కానూరు, యం.జి.రోడ్. 8712600536, 8712600537,
శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368
విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640
విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702
విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్. 9440804183, 9246666209
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
బ్రాడిపేట, గుంటూరు. 9246666215, 9100991706
బ్రమ్మం గారి రోడ్డు, లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905.
గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628
ఎనికేపాడు, ఏలూరు రోడ్. 9100991703, 9154281626
పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47
గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79
రత్నా టాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్‌రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లే. 9390006609, 9154281200
బాపూజి మార్కెట్, ఒంగోలు. 9246666329, 9154279911, 12.